Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 31.05.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 52 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



• జగన్ ప్రమాణస్వీకారం...

# రాజన్న పాలనకు శ్రీకారం

- కొడుకుగా అడుగుపెట్టి.. నాయకుడిగా ఎదిగిన అనితరసాధ్యుడు
- లక్షలాదిమంది అభిమానుల ఆనందోత్సాహాల మధ్య వేడుక
- జగన్‌కు సంపూర్ణంగా సహకరిస్తామన్న ప్రధాని మోడీ
- ప్రమాణస్వీకారానికి విచ్చేసి జగన్‌ను ఆశీర్వదించిన కేసీఆర్, స్టాలిన్
- వైయస్సార్ పెన్షన్ ఫైలుపై సిఎంగా జగన్ తొలిసంతకం


గవర్నర్ సమక్షంలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న వై.యస్.జగన్

ఒక యోధుడి పోరాట ఫలితమిది.
ఒక వీరుడి విజయచిహ్నమిది.
ఒక వ్యక్తి తన శక్తిని ధారబోసి సృష్టించిన ప్రళయమిది.
ఒక నాయకుడి పట్టుదలకు ప్రభంజనమే తలవంచిన తరుణమిది.
వై.యస్.జగన్మోహన్‌రెడ్డి... నిన్నటి వరకు దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి తనయుడు... వైయస్సార్ కాంగ్రెస్ అనే ప్రాంతీయ పార్టీ అధ్యక్షుడు. కాని, ఈరోజు నుండి చరిత్ర మారింది. రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైంది.

(వివరాలు 2వ పేజీలో)





ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోడీతో...


హైదరాబాద్‌లో తెలంగాణ సిఎం కేసీఆర్, కేటీఆర్ దంపతులతో జగన్ దంపతులు


తిరుమల వెంకన్న సన్నిధిలో...


కడప పెద్దదర్గాలో...




వైయస్ పింఛన్ పథకం ఫైలుపై తొలిసంతకం చేస్తున్న వై.యస్.జగన్



జగన్‌తో ఆత్మీయంగా మాట్లాడుతున్న కేసీఆర్



స్టాలిన్‌కు జ్ఞాపికనందజేస్తున్న వై.యస్.జగన్



భావోద్వేగానికిలోనై తనయుడిని ఆప్యాయంగా హత్తుకుంటున్న తల్లి వై.యస్.విజయమ్మ

## జగన్ ప్రమాణస్వీకారం..

# రాజన్న పాలనకు శ్రీకారం

**రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే సొంతంగా పార్టీని స్థాపించి తాను పోటీ చేసిన రెండో దఫా సార్వత్రిక ఎన్నికలలోనే 86శాతం ఫలితాలను సాధించి ఏకైక నాయకుడుగా వై.యస్.జగన్ చరిత్ర సృష్టించాడు. కోట్లమంది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 12.23 గంటలకు నవ్యాంధ్రప్రదేశ్ 2వ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రమాణస్వీకారోత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాది మంది అభిమానులు, వైసిపి కార్యకర్తలు తరలి రావడంతో సభా ప్రాంగణం జనసంద్రమైంది.**

"వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అను నేను" అని జగన్ చేత గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రమాణ స్వీకారం చేయిస్తుంటే సభా ప్రాంగణం చప్పట్లతో హోరెత్తిపోయింది. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్ర శేఖరరావు, డిఎంకె అధినేత స్టాలిన్... ఇంకా ఎందరో ప్రముఖులు ప్రమాణస్వీకారోత్సవ వేడుకకు హాజరయ్యారు.

### ప్రకృతి పరవశం...

అదేం ఖర్మోగాని 29వ తేదీ దాకా రాష్ట్రాన్ని ఎండలు మండించాయి. అదరకాసిన ఎండల ధాటికి ప్రజలు అల్లాడిపోయారు. మరి వై.యస్. కుటుంబం పట్ల ప్రకృతికి ప్రత్యేకప్రేమ వుందో ఏమోగాని, 30వ తేదీన వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జగన్ ప్రమాణస్వీకారం కోసమే అన్నట్లుగా విజయవాడలో అయితే ముందురోజు వర్షం పడింది. 2004–2009ల మధ్య దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి పరిపాలనలో ఎప్పుడూ వర్షాలు పడేవి. ఆయన కాలంలో ఎండాకాలం ఎప్పుడొచ్చేదో ఎప్పుడు పోయేదో కూడా తెలిసేది కాదు. 2014 నుండి చంద్రబాబు వచ్చాక ఎండలు, కరువు యధావిధిగా మళ్ళీ రాష్ట్రాన్ని చుట్టుముట్టాయి. ఇప్పుడు జగన్ ప్రమాణస్వీకారం రోజు నుండే వాతావరణంలో మంచి మార్పులకు శ్రీకారం చుట్టినట్లయ్యింది.

### తొలి సంతకం వైయస్సార్ పెన్షన్ ఫైలు పైనే...

2004లో దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తాను పాదయాత్రలో హామీ ఇచ్చిన రైతులకు ఉచిత విద్యుత్ ఫైలు పైనే మొదటి సంతకం చేశారు. అలాగే జగన్ కూడా ఈ ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చినట్లే 'నవరత్నాలు'లోని వైయస్సార్ పెన్షన్ పథకం ఫైలుపై తొలి సంతకం చేశారు.

### సానుకూల సంకేతాలు...

రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు వెలువడి వైసిపికి భారీ మెజార్టీ వచ్చిందనగానే ఒక్కసారిగా ఎన్నికల వాతావరణం మారిపోయింది. చంద్రబాబు నిన్నటి వరకు అటు కేంద్రంలో వున్న మోడీతోనూ, తోటి తెలుగు రాష్ట్ర సీఎం కేసీఆర్‌తోను వైరం కొనసాగించాడు. జగన్ ఆ పరిస్థితిని పూర్తిగా మార్చాడు. ప్రమాణస్వీకారానికి ముందే తెలంగాణ సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోడీని, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాను మర్యాదపూర్వకంగా కలిశాడు. ప్రధాని అపాయింట్‌మెంట్ జగన్‌కు 20నిముషాలు మాత్రమే వుండింది. కాని ప్రధాని మోడీ – జగన్‌ల భేటీ గంటా 20 నిముషాల పాటు సాగింది. మోడీతో భేటీలో జగన్ ప్రత్యేకహోదా ఆవశ్యకతను ప్రధానంగా ప్రస్తావించారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో వున్న ఆంధ్ర ప్రదేశ్‌ను అన్ని విధాలా ఆదుకుంటామని జగన్‌కు మోడీ హామీ ఇచ్చారు. ప్రధానితో భేటీ ముగిశాక సాధారణంగా సిఎంలు దానిపై ప్రకటన చేస్తుంటారు. కాని ఇక్కడ మాత్రం జగన్‌తో సమావేశం అద్భుత మంటూ ప్రధాని నరేంద్ర మోడీనే స్వయంగా ట్వీట్ చేయడం జగన్‌కు ఆయన ఇస్తున్న ప్రాధాన్యతకు అద్దం పడుతుంది.



### అద్భుతం.. అనిర్వచనీయం... జగన్ ప్రయాణం...

ఉమ్మడి రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇంతవరకు 14మంది ముఖ్యమంత్రులయ్యారు. ఏ ముఖ్యమంత్రి కొడుకు కూడా మళ్ళీ ముఖ్యమంత్రి కాలేదు. వై.యస్. జగన్మోహన్‌రెడ్డి ఒక్కడే ఆ ఘనతను సాధించాడు. అయితే కేవలం వారసత్వ రాజకీయాల మూలంగానే జగన్ సీఎం కాలేదు. సీఎం పదవిని తెచ్చి ఎవరూ ఆయన చేతుల్లో పెట్టలేదు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే క్షణాలకు ముందు 9ఏళ్ళుగా ఆయన పడ్డ కష్టం పగోడికి కూడా రాకూడదనుకుంటారు. ఆయనను అన్నీ ఇన్నీ కష్టాలు పెట్టలేదు. 2009 సెప్టెంబర్ 2వ తేదీన వై.యస్. మరణించారు. ఆయన స్థానంలో జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలంటూ ఆరోజు 150మంది దాకా ఎమ్మెల్యేలు సంతకాలు చేసి సోనియా గాంధీకి పంపించారు. అయితే ఆమె దానిని తిరస్కరించి ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా పెట్టిన రోశయ్యనే ఆ పదవిలో కొనసాగించింది. అయితే ఆరోజు దీనిపై జగన్ ఎలాంటి విచారం వ్యక్తం చేయలేదు. కాని, తన తండ్రి మృతితో తల్లడిల్లిపోయి ప్రాణాలనే వదిలిన వారి కుటుంబాలను ఓదార్చడం కోసం ఆయన తలపెట్టిన ఓదార్పుయాత్రకు బ్రేకులు వేయాలని సోనియా భావించింది. ఓదార్పు యాత్ర ఆపమంది. ప్రజల్లో వై.యస్. పట్ల వెల్లువెత్తిన అభిమానాన్ని చూసి సోనియా తట్టుకోలేకపోయింది. జగన్‌కు కేంద్రమంత్రి పదవి ఇస్తానని ఆశపెట్టింది. ప్రజలో... పదవో... తేల్చుకోమంది. కాని, జగన్ ప్రజలబాటనే ఎంచుకున్నాడు. సోనియాను ఎదిరిస్తే ఏమవుతుందో ఆయనకు తెలుసు. తానుపోయే బాటలో ముళ్ళు, రాళ్ళు వుంటాయని తెలిసినా, ధర్మ మార్గం అదే కాబట్టి దానినే ఎంచుకున్నాడు. తన తల్లి విజయమ్మతో కాంగ్రెస్‌ను వదిలొచ్చాడు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించాడు. జగన్, విజయమ్మలు కాంగ్రెస్ ద్వారా వచ్చిన ఎంపి, ఎమ్మెల్యే పదవులకు రాజీనామాలు చేశారు. ఉపఎన్నికల్లో అఖండ విజయం సాధించారు. అదే సమయంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు మొదలయ్యాయి. జగన్‌పై అక్రమాస్తుల కేసులంటూ అక్రమ కేసులు నమోదయ్యాయి. కేంద్రంలో కాంగ్రెస్... రాష్ట్రంలో కాంగ్రెస్... అలాగే ప్రతిపక్ష తెలుగు దేశం... మీడియా... అధికారయంత్రాంగం... అంతా కలిసి జగన్‌పై మూక్కుమ్మడి దాడి... బెయిల్ కూడా రాకుండా 16నెలలు జైలులో పెట్టారు. జగన్ ఈ కష్టాలు నాకొద్దని ఏ ఒక్క క్షణం ఆలోచించి సోనియా గాంధీతో రాజీపడి వున్నా ఆయన మీద కేసులుండేవి కావు. జైలుకెళ్లేవాడూ కాదు. కాని, జగన్ ఆ పని చేయలేదు. కాంగ్రెస్ అధిష్టానంతో రాజీలేని పోరాటానికే సిద్ధపడ్డాడు. జైలు జీవితం అనుభవించాడు. ప్రత్యర్థుల దాడులు ఎదుర్కొన్నాడు. 2012లో తనవెంట నడిచొచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల చేత రాజీనామాలు చేయించి, ఉపఎన్నికల్లో వైసిపి నుండి గెలిపించాడు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం నెలకొన్న పరిస్థితులు మోడీ, పవన్ కళ్యాణ్‌ల మద్దతు చంద్రబాబుకు వుండడం వల్ల జగన్ ఆ ఎన్నికల్లో అధికారాన్ని అందుకోలేక 67సీట్లతో బలమైన ప్రతిపక్ష నాయకుడు కాగలిగాడు.

తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో అయితే ఆయన ప్రతిపక్ష నేతగా రాటుదేలాడు. ఈ 5ఏళ్లు ప్రజల మధ్యనే తిరిగాడు. ప్రత్యేకహోదా అంశాన్ని తన పోరాటాలతో సజీవంగా నిలబెట్టాడు. తన పార్టీ ఎమ్మెల్యేలను, ఎంపీలను అధికారపార్టీ వాళ్ళు కొంటున్నా, వారిని జగన్ పల్లెత్తు మాట అనలేదు. దేవుడే వారికి సమాధానం చెబుతాడని నమ్మేవాడు. ఇప్పుడు ఆ దేవుడే వారికి తగిన శాస్తి చేశాడు. వైసిపి నుండి గెలిచి తెలుగుదేశంలో చేరిన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఏమయ్యారో అందరూ చూశారు.

### తండ్రిని తలపిస్తాడా? మరపిస్తాడా...?

ఉమ్మడి రాష్ట్రంలో ఇంతవరకు 14మంది ముఖ్య మంత్రులుగా పని చేస్తే ప్రజలు రాజశేఖరరెడ్డి పరిపాలనను గొప్పగా చెప్పుకుంటుంటారు. ఆయన సీఎంగా పని చేసింది ఐదేళ్ళే అయినా, ఐదు తరాల వాళ్ళు చెప్పుకునేలా ప్రజలకు మంచి పరిపాలన అందించాడు. జగన్ కూడా తండ్రిని తలపించేలా, అంతకంటే మెరుగ్గా మరిపించేలా ప్రజలను మురిపించేలా పాలన కొనసాగించాలని ఆకాంక్షిద్దాం!







# నెల్లూరీయులకు కానుక.. బాలూ పుట్టినరోజు వేడుక

- **జూన్ 4న ఆత్మీయ ఆనంద సంబరంగా పురస్కారాల ప్రదానోత్సవం**
- **ప్రముఖ సినీనటుడు చంద్రమోహన్, సమాజ సేవకుడు ఆబిద్ సూర్తిలకు పురస్కారాలు**

*జూన్ 4 ఒక విశేషమైన రోజు. మన రాగాల పట్టి.. గానాల ముద్దుబిడ్డ.. బాలూ పుట్టినరోజు. నెల్లూరీయులకు అది పండుగ రోజు. తన గంధర్వగానం ద్వారా అశేషప్రజానీకాన్ని ఆనందడోలికలూగించే విఖ్యాత గాయకుడైన బాలూ జన్మదినోత్సవమంటే నెల్లూరీయులకు నిజంగా ఓ పండుగే. అంతేకాదు, ఆరోజున ఇద్దరు విశిష్ట వ్యక్తులకు యస్.పి.బాలు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం కూడా జరుగుతుంది. ఈ వేడుకకు అందరూ ఆహ్వానితులే!...*





ప్రఖ్యాత గాయకునిగా ప్రపంచ ప్రసిద్ధి గాంచిన భారతీయ సినిమా గాయకుడు.. గానగంధర్వుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం(ఎస్పీ బాలూ) పుట్టినరోజు వేడుక అంటే చాలు.. నెల్లూరీయులు మరెంతగానో పులకించిపోతారు. బాలూ పుట్టినరోజును అత్యంత ఉత్సాహంతో.. అంబరాన్నంటే ఆత్మీయానంద సంబరంగా జరుపుకుంటారు. అందుకే, ఈ వేడుక..నెల్లూరీయులకు ఒక అద్వితీయమైన కానుక. కన్నులపండువగా..వీనులవిందుగా జూన్ 4న జరిగే ఈ వేడుకకు నెల్లూరు పురమందిరం వేదిక కాబోతోంది. మీరూ రండి!.. ఈ అపురూపమైన వేడుకలో మనం కూడా పాల్గొందాం!.. మంచి ముత్యాల్లాంటి మాటలు, వెన్నెలసోనల్లాంటి పాటలతో పరవశించిపోదాం!...

పుట్టినరోజుల్ని ఎంతో ఆడంబరంగా ఎంతోమంది జరుపుకుంటూ ఉంటారు. అది సర్వసాధారణం. అయితే, బాలూ మాత్రం అందుకు భిన్నంగా ఆ ఆనందోత్సవాన్ని తన ఆత్మీయులందరిలో ఒక పండుగలా జరుపుకోవడమే కాక, కళామతల్లి ముద్దుబిడ్డలకు, సమాజానికి విశిష్టమైన సేవలందిస్తున్నవారికి తన పేరుతో జాతీయస్థాయి పురస్కారాలను ప్రదానం చేసి వారికి మరింత ఉత్సాహాన్ని ప్రోత్సాహాన్ని అందిస్తూ.. తన పుట్టినరోజును సార్ధకం చేసుకుంటున్నారు. నెల్లూరులోని శ్రీవిజేత ఆర్ట్స్ వారు ఈ కార్యక్రమాలకు సారథ్యం వహిస్తే.. బాలూగారికి ఆత్మీయులైన మిత్రులు వీరిశెట్టి హజరత్‌బాబు, తుంగా శివప్రభాత్‌రెడ్డి తదితర మిత్రబృందమంతా వారికి అండదండగా స్థానిక సహకారం



**ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఎస్పీ బాలు, ప్రభు, వెన్నెలకంటి, హాజరత్‌బాబు**

అందిస్తూ ఈ కార్యక్రమాలను జయప్రదం గావిస్తున్నారు. ఈ మూడో ఏట కూడా బాలూ పుట్టిన రోజైన జూన్ 4న నెల్లూరు పురమందిరంలోని ఆరుబయట ప్రాంగణంలో సాయంత్రం 6.30గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం ఎంతోమంది ప్రముఖులు, కళాకారులు, సంగీతాభిమానుల మధ్య ఎంతో సందడిగా జరుగనుంది. ఈ సందర్భంగా, దాదాపు 50 ఏళ్ళుగా సినీ జగత్తులో వెన్నెల వెలుగులు విరజిమ్ముతూ, తనదంటూ ప్రత్యేకమైన నటనా వైభవంతో సినీలోకంలో ప్రఖ్యాతిచెందిన విఖ్యాత సినీనటుడు, నవరస నటనా ధురీణుడు ఎం.చంద్రమోహన్‌కు, అదేవిధంగా ముంబైకి చెందిన మరో ప్రముఖ సమాజసేవకుడు, 'డ్రాప్ డెడ్ ఫౌండేషన్' అనే సంస్థను స్థాపించి, జీవరాశులకు ప్రాణప్రదమైన నీటిని.. ఒక్క బొట్టు కూడా వృథా చేయకూడదంటూ సమాజాన్ని చైతన్యవంతం గావిస్తున్న జలసంరక్షకుడు ఆబిద్ సూర్తికి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జాతీయ పురస్కారాలను బహుకరించబోతున్నారు. ఇంత విశిష్టమైన వ్యక్తులకు బాలూ గారు తన పుట్టినరోజున ఈ ప్రతిష్టాత్మక పురస్కారాలతో సత్కరించబోతున్నారు. అపురూపమైన ఈ వేడుకలో పాల్గొనడం నెల్లూరీయులందరికీ ఒక మహద్భాగ్యం అని వేరే చెప్పనక్కర లేదు. మరో విషయం..సభా కార్యక్రమానికి ముందు, సినీనటుడు చంద్రమోహన్ నటించిన చిత్రాల్లోని కొన్ని పాటలను ఎంపిక చేసి 'చంద్రమోహనం' పేరుతో నిర్వహించే సినీగీతమాలిక కార్యక్రమం కూడా ఉంది. కళాప్రియులు, సంగీతాభిమానులైన నెల్లూరీయులకు ఇంతకంటే సుమధురమైన కానుక ఇంకేమి కావాలీ?.. ప్రముఖ గాయకులు ఎస్పీ చరణ్, ప్రవీణ్, నాదప్రియల సమ్మోహన గానంతో ఈ 'చంద్రమోహనం' సంగీత–గానలాహిరిలో అందరినీ ఓలలాడిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

### విశిష్టవ్యక్తులను గౌరవించుకోవడం సంతోషకరం - ఎస్పీ బాలూ

ఈ సందర్భంగా ఎస్పీ బాలూ ఈనెల 28న నెల్లూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సమాజానికి విశిష్టసేవలందించేవారిని గౌరవించి సత్కరించుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. తాను చెన్నైలో ఉంటున్నప్పటికీ నెల్లూరులో తన మిత్రబృందమైన తుంగా శివప్రభాత్‌రెడ్డి, హజరత్‌బాబు, శేషగిరీశం తదితరుల సహకారంతో మూడో ఏట ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తన ఆత్మీయులు శాంతా బయోటిక్స్ అధి నేత కోడూరు ఈశ్వర వరప్రసాద్‌రెడ్డి, ప్రముఖ సినీకవి వెన్నెలకంటి, మురళీకృష్ణ–70 ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు, 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి, రాంభట్ల నృసింహశర్మ తదితరులు అతిథిదేవుళ్ళుగా పాల్గొంటారని వివరించారు.




## 'ప్రభా'తం

# దేశాభ్యున్నతికి బంగారుబాటలు



ప్రజాహృదయ విజేత..మోదీ నిజాయితీకి, మోదీ ప్రభుత్వ పనితీరుకు, మోదీ అవినీతి రహితమైన విశుద్ధ పాలనకు భారతావని హృదయపూర్వకంగా రెండవసారి తన సంపూర్ణ మద్దతు ప్రకటించడం దేశానికే గర్వకారణం. దేశంలో ఇక అవినీతిని పూర్తిస్థాయిలో నిరోధించి, నిరుద్యోగాన్ని జయించి, పేదరికాన్ని రూపుమాపి అన్ని రంగాల్లో దేశాభ్యున్నతికి బంగారుబాటలు వేయాలన్నదే ప్రజల ఆకాంక్ష, అందుకు శక్తివంచన లేకుండా మోడీ ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

స్వతంత్ర భారత చరిత్రలో సంపూర్ణమైన ఆధిక్యతతో రెండవసారి అధికారపీఠం అధిష్ఠించి ప్రధాని మోదీ రికార్డు సృష్టించడంతో ఇక మోదీ ప్రభుత్వ పాలనలో దేశం మరింత వేగంతో ప్రగతిపథంలో ముందుకు దూసుకుపోతుందని దేశప్రజలంతా భావిస్తున్నారు. సమస్యల సవాళ్ళన్నిటినీ అధిగమించి, సకల జన సంక్షేమమే లక్ష్యంగా దేశం పురోగమిస్తుందని, ఆ సమున్నత లక్ష్యంతోనే ప్రధాని మోడీ పాలన కొనసాగిస్తారని అందరూ ఆకాంక్షిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే ప్రధాని మోడీ కూడా ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నారు. దేశానికి ఇవన్నీ శుభసూచికలే.

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి అఖండ విజయం సాధించడం ప్రధాని మోడీ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే అప్పటికంటే ఇప్పుడు మరో 21 పార్లమెంట్ సీట్లు కూడా అధికంగా గెలుచుకోవడం విశేషం. అంతేకాదు, గతంలో కంటే సుమారు అయిదున్నర కోట్లకు పైగానే ఓట్లు లభించాయంటే ప్రధాని మోడీకి ప్రజల్లో ఎంత పట్టు ఉన్నదో.. మోడీ పట్ల ప్రజల గుండెల్లో ఎంతటి గట్టి విశ్వాసం ఉన్నదో స్పష్టమవుతుంది. ఆ విశ్వసనీయతే ఇంతటి ఘనవిజయాన్ని సాధించిపెట్టిందనేది తేటతెల్లమైంది. దేశంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ఏటా 72వేల రూపాయలు అందిస్తామంటూ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశచూపినా, మోదీ సారథ్యంలోని ప్రభుత్వమే తమ సంక్షేమం చూసుకుంటుందని భారత ప్రజలు విశ్వసించారంటే, మోదీ ప్రభుత్వం పట్ల, మోదీ పనితీరు పట్ల ప్రజలకు ఉన్న విశ్వసనీయతకు ఇంతకన్నా నిదర్శనం ఇంకేమి కావాలి?... గతంలో కంటే అత్యధికంగా పేదప్రజలే మోదీకి ఈ ఎన్నికల్లో ఓటువేసి అత్యంత ఘన విజయం సాధించిపెట్టారు కూడా. చేసే పనిలో తప్పులు దొర్లవచ్చేమో కానీ తప్పుడు పనులు చేయబోననే ప్రధాని మోదీ విశిష్టమైన వ్యక్తిత్వమే ఈ ఎన్నికల్లో ఆయన విజయానికి ఢంకా భజాయించిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆ మంచి వ్యక్తిత్వంతోనే మోదీ అన్నివర్గాల ప్రజల మనసులను గెలుచుకున్నారు. అందువల్లనే కులాలు, వర్గాలనే రాజకీయ లెక్కలు కాకుండా పూర్తిగా మోదీ ప్రభుత్వ పనితీరును శెభాష్ అని మెచ్చుకుంటూ ప్రజలు అద్భుతమైన తీర్పునిచ్చారు. ఈ అఖండ విజయంతో మోదీ ప్రభుత్వం ఇక మరింత ధీమాగా ముందుకు వెళ్తుందని అందరూ అంచనా వేస్తున్నారు. అటు జాతీయస్థాయిలో దేశం సాధించాల్సిన లక్ష్యాలు, ఇటు ప్రాంతీయస్థాయిలో రాష్ట్రాల ప్రజల ఆశలు ఆకాంక్షలు రెండింటినీ దృష్టిలో పెట్టుకుని పాలన సాగిస్తూ ప్రగతి పథంలో దేశాన్ని ముందుకు పయనింపజేస్తారని, ఆ సమతూకాన్ని సాధించాలంటే దేశంలోని అన్నివర్గాలను కలుపుకుని ముందుకు సాగుతారని అందరూ విశ్వసిస్తున్నారు. ఎందుకంటే ఇలాంటి విషయాలు మోదీకి కొత్తగా ఎవరూ చెప్పనక్కర లేదు. "ఓటు వేసినవారే కాదు, వేయనివారు కూడా మనవారే"..అనే సమున్నతమైన ఆదర్శాన్ని వంటబట్టించుకున్న మహానేత కనుకనే మోదీ భారత ప్రజల హృదయ విజేత అయ్యారు. ఈ దేశాన్ని ఎలా సమర్థవంతంగా పురోగామి పథంలోకి మళ్ళించాలో ఒక స్పష్టమైన విధానం ఉన్న మోదీ మళ్ళీ ప్రధాని కావడం దేశానికే గర్వకారణమని చెప్పాలి. సమాజంలో ప్రతి ఒక్కరి అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా ప్రధాని మోదీ ఇటీవల ప్రకటించడం, తమకు ఓటువేసిన వారితోపాటు వేయనివారి పురోగతిని కూడా దృష్టిలో పెట్టుకుని నిజాయితీగా పని చేస్తామని చెప్పడం ప్రధాని మోడీ విశిష్ట వ్యక్తిత్వానికి, ఉన్నతాదర్శాలకు నిదర్శనం. 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్‌తో పాటు సబ్‌కా విశ్వాస్' అనేది తమ విధానంగా ఉండబోతుందని మోదీ రెండవసారి దిగ్విజయంగా ఎన్నికయ్యాక జరిగిన తొలి సభల్లో స్పష్టం చేయడం ప్రజల్లో మోడీ విధానాల పట్ల మరింత విశ్వాసాన్ని కలుగజేస్తోంది. ఎంతోకాలంగా దేశంలోని మైనార్టీ ప్రజల్లో అభద్రతా భావం ఉందని, వారిని కేవలం ఓటుబ్యాంకుగానే చూసే దుష్ట సంస్కృతికి స్వస్తిచెప్పి, మైనార్టీల సమస్యలు తీర్చి, వారి అభ్యున్నతికి పాటుపడాలని మోదీ తమ నాయకులకు దిశానిర్దేశం చేసి మైనార్టీవర్గాల భవిష్యత్తుకు భరోసా కల్పించడంతో ఆయా వర్గాల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది. అందులోనూ "ప్రజల పట్ల బాధ్యత, జవాబుదారీతనం నాయకుల్లో ఎల్లవేళలా ఉండాలే తప్ప, అధికారం చేతికి వచ్చింది కదా అని నాయకుల్లో అహంకారం పెరిగిపోవడం ఎప్పటికీ సరికాదని".. మోదీ కొత్తగా గెలిచిన తమ పార్టీ నాయకులకు హితవు చెప్పడం, అధికారాన్ని తలకెక్కించుకుని అహంకరించకుండా సేవాస్ఫూర్తితోనే పనిచేయాలని స్పష్టం చేయడం మోడీ చిత్తశుద్ధికి నిదర్శనం. సామాన్య ప్రజలకు నిబద్ధతతో సేవచేసేందుకే రాజకీయాలను, అధికారాన్ని వినియోగించాలని, ప్రజల పట్ల సమదృష్టితో పనిచేయాలని, ప్రజల సమస్యల పట్ల సానుభూతితో వ్యవహరించి సమస్యలు పరిష్కరించాలని కొత్తగా ఎన్నికైన పార్లమెంటు సభ్యులకు ప్రధాని మోదీ హితవు చెప్పారు. అలా ఒకరికి చెప్పడమే కాదు, గతంలోనే అంటే 2014లో అధికారం చేపట్టినప్పుడే తాను దేశానికి ప్రధానమంత్రిలా కాకుండా 'ప్రధాన సేవకునిలా' పనిచేస్తానని ప్రకటించి దేశంలో అత్యంత నిజాయితీగల నేతగా ప్రజల హృదయాల్లో మోదీ గాఢమైన ముద్ర వేసుకున్నారు. ఆ ముద్రను ఎవరూ చెరపలేరని తాజా ఎన్నికలు మరోసారి రుజువు చేశాయి.

ఏదేమైనా మోదీ నిజాయితీకి, మోదీ ప్రభుత్వ పనితీరుకు, అవినీతి రహితమైన విశుద్ధ పాలనకు భారతావని హృదయపూర్వకంగా రెండవసారి తన మద్దతు ప్రకటించిందంటే అతిశయోక్తి కానే కాదు. ఇక దేశంలో రానున్న కాలంలో.. అవినీతిని పూర్తిస్థాయిలో నిరోధించి, నిరుద్యోగాన్ని జయించి, పేదరికాన్ని రూపుమాపి దేశాన్ని అన్నివిధాలా పురోగతి వైపు మళ్ళించి దేశాభ్యున్నతికి బంగారుబాటలు వేయాలన్నదే ప్రజల ఆకాంక్ష. ఆ ఆశలను... ఆకాంక్షలను తప్పకుండా మోడీ ప్రభుత్వం నెరవేర్చేందుకు నిరంతరం శక్తివంచన లేకుండా కృషిచేస్తుందనడంలో ఎలాంటి సందేహం ఉండనక్కరలేదు.

### కన్నులపండువగా..
# పెంచలస్వామి కల్యాణోత్సవం

రాపూరు మండలంలోని పెంచలకోనలో భక్తుల కొంగుబంగారంగా వెలసివున్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం ఈ నెల 25న కన్నులపండువగా జరిగింది. స్వామివార్ల బ్రహ్మోత్సవాల తర్వాత వచ్చే తొలి శనివారం రోజు కనుక, ఆ రోజున భక్తులు పెద్దసంఖ్యలో కోనకు తరలివచ్చారు. ఈ సందర్భంగా శ్రీ నృసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి-చెంచులక్ష్మీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి వేడుక చేశారు. ఆలయంలో కొలువైవున్న శ్రీ ఆంజనేయస్వామికి ఆ రోజు ఉదయం సుప్రభాతసేవ, అనంతరం అభిషేకం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీ లక్ష్మీనృసింహస్వామికి, దేవేరులకు నేత్రపర్వంగా కల్యాణోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 6 గంటలకు దేవదేవేరుల ఉత్సవ విగ్రహాలను తిరుచ్చిపై ఉంచి సహస్రదీపాలంకరణ మండపంలో నయనానందకరంగా ఊంజల్‌సేవ నిర్వహించారు. ఆలయ అధికారులు, నిర్వాహకులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.

### నెల్లూరు పోస్టల్ సూపరింటెండెంట్‌గా
# వెంకటేశ్వరరావు

నెల్లూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా కేవస్ వెంకటేశ్వరరావు బాధ్యతల చేపట్టారు. ఈయన విశాఖపట్నం నుంచి బదిలీపై నెల్లూరు వచ్చారు. ఈ సందర్భంగా అఖిల భారత తపాల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం సంఘం నెల్లూరు డివిజన్ అధ్యక్షుడు దుడ్డు రమేష్ బాబు, కార్యదర్శి ఆనంద్, కోశాధికారి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి శ్రీపతి, రాష్ట్ర సహాయ కోశాధికారి సుభాషిణిలు, ఎన్ఎఫ్‌పిఈ, ఏఐపీఈయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# నెల్లూరు కవయిత్రికి షిరిడీలో సత్కారం



షిరిడీ కవితోత్సవ కవి సమ్మేళనంలో సత్కారాన్నందుకుంటున్న ములుగు విజయదుర్గ

మహారాష్ట్రలోని షిరిడీ సాయిబాబా సన్నిధిలో షిరిడీ సాయి ఆధ్యాత్మిక సేవా సమితి పాలమూరు వారి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన షిరిడీ కవితోత్సవ కవి సమ్మేళనంలో నెల్లూరు వనంతోపుకు చెందిన ప్రముఖ కవయిత్రి ములుగు విజయదుర్గ (వినీల)ను సత్కరించారు. ఆకాశవాణి నిర్వహణాధికారి సియస్ రాంబాబు, సావరీస్ సర్వీసెస్ ఎస్టేట్స్ మల్టీట్రేడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కోదండపాణి, కార్యక్రమ నిర్వహణాధికారి సృజామి, భీంపల్లి శ్రీకాంత్ తదితరుల చేతుల మీదుగా శాలువ, జ్ఞాపికలతో ఆత్మీయ సన్మానం అందుకున్నారు. నెల్లూరుకు చెందిన కవులు, కవయిత్రులు, సాహితీవేత్తలు, కళాకారులు, నగర ప్రముఖులు విజయదుర్గను అభినందించారు.




## బాబు స్వయంకృతాపరాధాలు

2014 ఎన్నికల్లో ప్రజలు ఎన్నో ఆశలతో చంద్రబాబునాయుడుకు పట్టం కట్టారు. ఈ ఐదేళ్లలో ఆయన ప్రజల ఆశలను వమ్ము చేశాడు. 'మింగను మెతుకు లేకుంటే... మీసాలకు సంపంగి నూనె' అన్నట్లు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంతో దారుణంగా వుంటే ఆర్భాటాలకు పోయాడు. వేల కోట్లు దుబారా చేశాడు. అప్పులు పెంచాడు. ఉచిత పథకాలతో ఆర్థిక వ్యవస్థను నాశనం చేశాడు. తన పార్టీ ఎమ్మెల్యేలు రౌడీల్లా చెలరేగిపోతుంటే అడ్డుకోలేదు. మైనింగ్ మాఫియాను నిలువరించలేదు. అమరావతి రాజధాని పేరుతో ప్రజలను భ్రమల్లో పెట్టాడు. కాని, ప్రజలను ఒకసారి మోసం చేయొచ్చు. ఎల్లకాలం మోసం చేయలేరు. కాబట్టి రెండోసారి తమను మోసం చేసే అవకాశాన్ని చంద్రబాబుకు ఇవ్వలేదు ఈ రాష్ట్ర ప్రజలు.

**పిగిలాల సుధాకర్, నెల్లూరు.**

## తగిన శాస్తి జరిగింది

హిందువులపై విద్వేషం కక్కుతూ, బంగ్లాదేశ్ నుండి అక్రమంగా చొరబడ్డవారికి అన్ని వసతులు సమకూరుస్తూ దేశ భద్రతకు విఘాతం కలిగిస్తున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి నిన్నటి పార్లమెంటు ఎన్నికల్లో ఆ రాష్ట్ర ఓటర్లు గట్టి గుణపాఠం చెప్పారు. ఓట్ల కోసం దేశ ప్రయోజనాలను పణంగా పెట్టిందామె. అరాచకాలలో కమ్యూనిష్టులను మించిపోయింది. హిందువులను నిర్లక్ష్యం చేసినందుకు తగిన శాస్తి జరిగింది. ఇకనైనా మేలుకోకుంటే రేపు ప్రభుత్వాన్ని కూడా కోల్పోవచ్చు.

**జి. మహిధర్, నెల్లూరు.**

## ఇది సామాన్యుడి విజయం

కేంద్రంలో నరేంద్ర మోడీ సారథ్యంలోని ఎన్డీఏ గెలుపు సామాన్యుడి విజయమే. నరేంద్ర మోడీది సామాన్య మధ్యతరగతి కుటుంబం. వారసత్వ రాజకీయాల నుండి రాలేదు. కేవలం సైద్ధాంతిక రాజకీయాల నుండే ఎదిగాడు. ఈరోజు నెహ్రూ, ఇందిరా గాంధీల కంటే కూడా గొప్ప ప్రధాని అయ్యాడు. ఐదేళ్లు ప్రధానిగా పనిచేశాక వీళ్లెవరు కూడా ఇలాంటి ఘన విజయాలను అందుకోలేదు. నరేంద్ర మోడీ మాత్రమే తన ఐదేళ్ళ పరిపాలనను రెఫరెండంగా చేసుకుని ప్రజల ముందుకు పోయాడు. ప్రజలు కూడా ప్రస్తుత కాలంలో దేశానికి మోడీ నాయకత్వం ఎంత అవసరమో గుర్తించారు. 2014 కంటే కూడా ఈ ఎన్నికల్లో ఇంకా మంచి మెజార్టీతో విజయం చేకూర్చారు. 130 కోట్ల జనాభాగల భారతదేశంలో ఒక సామాన్యుడు సాధించిన ఈ ఘన విజయం చరిత్రకే తలమానికం.

**– సి. భరత్, హైదరాబాద్.**



## ఆరుగురు ఎంపీలతో...

# నెల్లూరుకు పూర్వ వైభవం

2004–2014ల మధ్య కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారత పార్లమెంటులో నెల్లూరుజిల్లాకు చెందిన 9మంది ఎంపీలుగా ఉండేవాళ్ళు. దేశ చరిత్రలోనే ఒక జిల్లాకు సంబంధించి ఇంతమంది ఎమ్మెల్యేలు ఒకే కాలంలో పార్లమెంటులో వున్న సందర్భం ఎప్పుడూ లేదు. అప్పట్లో పనబాక లక్ష్మి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, చింతా మోహన్, టి.సుబ్బరామిరెడ్డి, లగడపాటి రాజగోపాల్, యం.వెంకయ్యనాయుడు, వి.మధులు పార్లమెంటులో కొనసాగారు. ఆ తర్వాత నెల్లూరుజిల్లాకు సంబంధించిన పార్లమెంటు సభ్యులు తగ్గుతూ వచ్చారు.

అయితే ఈ ఎన్నికల ద్వారా నెల్లూరుజిల్లాకు సంబంధించి నెల్లూరుజిల్లా వాళ్ళు ఆరుగురు మళ్ళీ పార్లమెంటులో వుండబోతున్నారు. ఇప్పటికే రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వి.విజయసాయిరెడ్డిలు వుండగా ఒంగోలు నుండి గెలిచిన మాగుంట శ్రీనివాసులురెడ్డి, తిరుపతి నుండి గెలిచిన బల్లి దుర్గాప్రసాద్‌లు కూడా నెల్లూరుజిల్లా వాళ్ళే! ఇక నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఎలాగూ నెల్లూరోడే! వీళ్ళు 5మంది వైసిపి సభ్యులే కాగా, కాంగ్రెస్ నుండి రాజ్యసభ సభ్యుడిగా వున్న డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి కూడా నెల్లూరు వాడే కావడం గమనార్హం. దీంతో పార్లమెంటులో నెల్లూరుజిల్లా వాళ్ళు ఆరుగురు వున్నట్లయ్యింది.





## ఎన్టీఆర్ ప్రభంజనాన్ని...

# తలదన్నిన 2019 ఎన్నికలు

ఓట్ల తుఫాన్ ఇలా వుంటుందా... ఫలితాల సునామీ ఇంటే ఇదా... అని ఆశ్చర్యపరిచేటంతగా ఈ ఎలక్షన్ ఫలితాలున్నాయి. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇప్పటివరకు 1983నాటి ఫలితాలను ప్రభంజనంగా చెప్పుకుంటుంటారు. అయితే ఈ ఎన్నికల ఫలితాల ముందు 1983 నాటి ఎన్టీఆర్ ప్రభంజనం కూడా తుడిచి పెట్టుకుపోయింది.

1983 ఎన్నికల్లో కూడా నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం క్లీన్‌స్వీప్ చేయలేకపోయింది. ఆ ఎన్నికల్లో జిల్లాలో మిగిలిన అసెంబ్లీలన్నీ కూడా తెలుగుదేశం ఖాతాలో పడ్డా, ఉదయగిరి అసెంబ్లీ నుండి మాత్రం బీజేపీ అభ్యర్థిగా యం.వెంకయ్యనాయుడు విజయం సాధించాడు. ఉదయగిరిలో టిడిపికి డిపాజిట్ దక్కలేదు.

అప్పటి ఎన్నికలతో పోలిస్తే, అప్పటి ఎన్టీఆర్ ప్రభంజనంతో పోలిస్తే ఈ ఎన్నికల్లో జగన్ సునామీనే సృష్టించాడని చెప్పవచ్చు. జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలను క్లీన్‌స్వీప్ చేశారు. నెల్లూరు సిటీ, కావలి, సర్వేపల్లి నియోజకవర్గాలను మినహాయిస్తే మిగతా 7 అసెంబ్లీ నియోజకవర్గాలలోనూ భారీ మెజార్టీలు సాధించారు. ఏ రకంగా చూసినా జిల్లా రాజకీయ చరిత్రలో పెద్ద ప్రభంజనం 2019 ఎన్నికలే!

# కాంగ్రెస్ క్లోజ్



నెల్లూరుజిల్లా... ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట. తెలుగుదేశం ప్రభంజనాలు పని చేసిన రెండుసార్లు తప్పితే మిగతా అన్ని సందర్భాలలోనూ ఈ జిల్లా ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలిచారు. తెలుగుదేశం పార్టీ పెట్టిన తర్వాత జరిగిన 1983 తొలి ఎన్నికల్లోనూ, ఆ తర్వాత 1994 ఎన్నికల్లో మాత్రమే ఈ జిల్లాలో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. అప్పటికీ 1994లో కాంగ్రెస్‌కు కావలి సీటు దక్కింది. 1985లో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం క్లీన్‌స్వీప్ చేసింది. కాని, నెల్లూరుజిల్లాలో దాదాపు సగం సీట్లను కాంగ్రెస్ గెలుచుకోగలిగింది. 1999లోనూ తెలుగుదేశం అధికారంలోకి వచ్చినప్పుడు ఈ జిల్లాలో కాంగ్రెస్ నాలుగుసీట్లు గెలవగలిగింది. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సందర్భాలలో అయితే దాదాపు అన్ని సీట్లు కాంగ్రెస్‌వే! అలాగే నెల్లూరు పార్లమెంటులో కూడా ఎప్పుడూ కాంగ్రెస్‌దే ఆధిపత్యం. అలాంటి జిల్లాలో ఇప్పుడు కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. 2014 ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ, పది అసెంబ్లీలకు పోటీలో వుంటే, కాంగ్రెస్‌కు ఒకటి రెండు చోట్ల గౌరవప్రదమైన ఓట్లన్నా వచ్చాయి. ఈ ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. కాంగ్రెస్ కంటే కూడా ముక్కు ముఖం తెలియని ఇండిపెండెంట్లకే ఎక్కువ ఓట్లొస్తున్నాయి.




## అనిల్‌పై అభిమానం...

# 'సరిహద్దులు' దాటింది

ఒక ఎమ్మెల్యేకు అతను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం పరిధిలో అభిమానులున్నారంటే అర్థముంది. పోనీ ఎక్కువగా ఫోకస్ అయితే జిల్లా వరకు.... మరీ ఎక్కువగా పాపులర్ అయితే రాష్ట్రం వరకు... కాని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్‌పై అభిమానం రాష్ట్ర సరిహద్దులు కూడా దాటింది.

ఈ రాష్ట్రంలోనే కాదు, తెలంగాణలోనూ అనిల్‌కు అభిమానులుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ ఎన్నికల్లో అనిల్ నెల్లూరు నగరం నుండి గెలుపొందగానే తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా జంగారెడ్డిపల్లిలో ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ అభిమానులు ఫ్లెక్సీలు వేశారంటే.... ఎంత అభిమానం సంపాదించుకుని వుంటేనో కదా ఇలాంటిది జరిగేది.

# 'బల్లి'కి కలిసొచ్చిన అదృష్టం 'పనబాక'ను వెంటాడిన దురదృష్టం



***రాజకీయాలలో కష్టం, ధనమే కాదు వెంట్రుకవాసి అదృష్టం కూడా పని చేస్తుంటుంది. 2019 ఎన్నికల ఫలితాలను చూస్తే తలరాత, అదృష్ట రేఖ వంటి వాటిని నమ్మక తప్పదేమో ననిపిస్తుంది.***

బల్లి దుర్గాప్రసాద్ అనే నాయకుడు వైసిపిలో చేరతాడని, అతనికి ఆ పార్టీ తిరుపతి ఎంపి టిక్కెట్ ఇస్తుందని, రెండున్నర లక్షల మెజార్టీతో ఆయన గెలుస్తాడని ఎవరూ వూహించలేదు. ఈ ఎన్నికల్లో ఆయన తెలుగుదేశం తరపున ఉదయగిరి నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు పరిశీలకుడిగా పర్యటించాడు. అయితే అనూహ్యంగా వైసిపిలో చేరడం, చేరిన పక్క రోజే తిరుపతి ఎంపి అభ్యర్థిగా ప్రకటించడం, ఇక ఎన్నికలలో భారీమెజార్టీతో గెలుపొందడం ఒక కలగా జరిగిపోయాయి. బల్లి దుర్గాప్రసాద్ పరిస్థితి ఎలా వుందంటే ఎవరింటికో వెళుతున్న అదృష్ట దేవతకు రాంగ్ అడ్రస్ చెప్పి తన ఇంటికి రప్పించుకున్నట్లుగా వుంది.

అదే సమయంలో పనబాక దంపతుల పరిస్థితి ఎలా అయ్యిందంటే అదృష్టం వచ్చి కాలింగ్ బెల్ కొట్టబోతే 'డోంట్ డిస్టర్బ్' అని బోర్డును ఇంటి ముందు వేలాడదీసినట్లయ్యింది. ఎన్నికలకు కొన్ని నెలల ముందే పనబాక కృష్ణయ్య, లక్ష్మి దంపతులను తమ పార్టీలోకి ఆహ్వానించారు వైసిపి నాయకులు. పనబాక లక్ష్మికి బాపట్ల లోక్‌సభ, కృష్ణయ్యకు గూడూరు అసెంబ్లీ టిక్కెట్లు ఇస్తామన్నారు. పనబాక కృష్ణయ్య రావడానికి రెడీ అయ్యాడు. పనబాక లక్ష్మి పార్టీ మారడానికి సిద్ధపడలేదు. ఊపిరి వున్నంతవరకు కాంగ్రెస్సే అంది. కాని, చివరి క్షణంలో సోనియా ఆదేశాలతో తెలుగుదేశంలో చేరి తిరుపతి ఎంపి అభ్యర్థిగా నిలబడింది. తన రాజకీయ చరిత్రలో ఎప్పుడూ చూడనటువంటి పరాజయాన్ని చవిచూసింది. అదే గనుక వైసిపి వాళ్ళు అడిగినప్పుడు వీళ్ళు ఆ పార్టీలో చేరుంటే పనబాక లక్ష్మి ఎంపి, కృష్ణయ్య ఎమ్మెల్యే స్థానాలలో ఉండేవాళ్ళు.






## నెల్లూరు కబుర్లు

### విజయవాడకు
## భారీగా వెల్లిన అభిమానులు

రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారోత్సవాన్ని కళ్లార తిలకించడం కోసం నెల్లూరుజిల్లా నుండి భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. ఈ నెల 30న విజయ వాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ప్రమాణస్వీకార వేడుకను చూసేందుకు అభిమానులు ప్రత్యేకవాహనాలు వేసుకుని మరీ వెళ్లారు. చాలామంది పాస్‌ల కోసం ప్రయత్నించారు. అయితే ఎమ్మెల్యేకు ఐదు చొప్పున మాత్రమే పాస్‌లు ఇవ్వడం జరిగింది. సాధారణ జనంలో అయినా నిలబడి వేడుక చూడాలని అభిమానులు ఎండను కూడా లెక్క చేయకుండా తరలివెళ్లారు.

కాగా, జగన్ ప్రమాణస్వీకారోత్సవం జరుగుతున్న సమయంలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు నెల్లూరులో భారీ ఎత్తున బాణాసంచా కాల్చారు. అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు.

### ఇరుకళల పరమేశ్వరి అమ్మసేవలో
## ఎమ్మెల్యే అనిల్



సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరీ అమ్మవారిని నెల్లూరు నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ ఈనెల 26న దర్శించుకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మ వారికి పసుపు, కుంకుమ, సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఇఒ వేమూరి గోపి ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలను అందజేసి శేషవస్త్రాన్ని బహుకరించారు. వైయస్సార్ సీపీ నాయకులు పి.రూప్‌కుమార్ యాదవ్, జనార్ధన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఒట్టూరు సుధాకర్ యాదవ్, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### అర్జీదారులందరికి..
## న్యాయం చేయాలి

**- జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి**



ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తున్న ఎస్పీ రస్తోగి

నెల్లూరు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చే ప్రతి అర్జీదారుడికి న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి అధికారులకు సూచించారు. ప్రజా విజ్ఞప్తుల దినంలో భాగంగా ఈనెల 27న తన ఛాంబర్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీదారుడితో మాట్లాడి వారి సమస్యలు విన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సమస్యలతో వచ్చే ప్రజలకు న్యాయం చేయాలని, వారి సమస్యలను క్షుణ్ణంగా విని కేసులను పరిశీలించాలని జిల్లా వ్యాప్తంగా వున్న స్టేషన్‌హౌస్ అధికారులను ఆదేశించారు.



### జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డుకు
## కోట సునీల్

నెల్లూరుకు చెందిన కళాకారుడు తిరుమలశెట్టి చంద్ర గత ఏడాది మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కలప, ఇత్తడితో ఏడు అడుగుల ఎత్తు, నాలుగున్నర అడుగుల వెడల్పు గల దశ సహస్ర శివలింగాన్ని 45 రోజులపాటు శ్రమించి తీర్చిదిద్దారు. ఈ పవిత్ర శివలింగాన్ని హిందూ ధర్మ పరిరక్షణ సమితి జిల్లా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ కోట సునీల్‌కుమార్‌కు అందజేశారు. ఆయన శివలింగాన్ని గూడూరులోని సాయి సత్సంగ్ నిలయంలో ఉంచారు. ఈ క్రమంలో ఇంటర్నేషనల్ జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు వారు కోట సునీల్‌కుమార్‌కు సర్టిఫికెట్‌ను అందజేశారు. నెల్లూరు రాంజీనగర్‌లో ఈ సర్టిఫికేట్‌ను కళాకారుడు తిరుమలశెట్టి చంద్ర సమక్షంలో ఆయన అందుకున్నారు.

# మేకపాటికి ఆదాల ధన్యవాదాలు

నెల్లూరు పార్లమెంటు సభ్యులుగా ఎన్నికైన ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదివారం మాజీఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన స్వగృహంలో కలుసుకున్నాడు. ఎంపిగా విజయం సాధించిన ఆదాల ప్రభాకర్‌రెడ్డిని మేకపాటి అభినందించాడు. ఎన్నికల్లో సహకరించినందుకు మేకపాటి రాజమోహన్‌రెడ్డికి ఆదాల కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఈ సమయంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి కూడా అక్కడే వున్నాడు.



మేకపాటి రాజమోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

### సమ్మోహనం..
## సంహిత సంగీత విభావరి



భారతీయ సంప్రదాయ కళలను విదేశాల్లో ప్రదరిస్తూ అత్యున్నత ప్రతిభా పాటవాలను చాటుతున్న కళాకారులను చూసి భరతమాత గర్విస్తున్నదని హిందూ ధర్మ పరిరక్షణ సమితి ట్రస్ట్ కో–ఆర్డినేటర్ కోట సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఈనెల 26న నెల్లూరు టౌన్ హాలులో సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయురాలు, అమెరికాకు చెందిన మద్దూరు సంహిత నిర్వహించిన సుస్వర సంకీర్తన సంగీత విభావరి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సనాతన ధర్మ వైభవానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు. నెల్లూరుకు చెందిన ప్రసిద్ధ హరికథా భాగవతార్ జూటూరు రామదాసు మునిమనవరాలు సంహితను సంగీత సరస్వతిగా అభివర్ణించారు. నలుబోలు బలరామయ్య నాయుడు, చిన్ని నారాయణరావు, చలపతిరావు, సాయి వెంకట సుబ్రహ్మణ్యం, కొండూరు హరినారాయణ రెడ్డి, కళాకారులు, కళాభిమానులు, సాహితీవేత్తలు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## పడారుపల్లిలో మజ్జిగ చలివేంద్రం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రఘురామ్ ముదిరాజ్

నెల్లూరులోని 24వ డివిజన్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి అనంద్ ఆధ్వర్యంలో ఈనెల 26న మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. పిసిసి అధికారప్రతినిధి కనకట్ల రఘురామ్ ముదిరాజ్ చేతులమీదుగా ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామ్ ముదిరాజ్ మాట్లాడుతూ ఎక్కువగా పేదప్రజలు నివసించే ఈ ప్రాంతంలో, ఈ మండుటెండల్లో చల్లని మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేసిన ఆనంద్ అభినందనీయుడని కొనియాడారు. భగ్గుమంటున్న ఈ వేసవిలో ప్రజలకు ఉపశమనంగా సేవాసంస్థల వారు చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని ఆయన అన్నారు. రోజురోజుకీ తీవ్రమవుతున్న ఈ ఎండలను దృష్టిలో పెట్టుకుని నెల్లూరు నగర కార్పొరేషన్‌వారు ప్రభుత్వం ద్వారా ప్రతి డివిజన్‌లోనూ చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌తో పాటు ఏడుకొండలు, బాబు, తిరువీధి నారాయణ రావు, శ్రీనివాసులు, బాలకృష్ణ, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఆర్ఎం రవివర్మ బదిలీ

నెల్లూరు ఆర్టీసీ ఆర్ఎం రవివర్మ విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో సీఎంఈ సీఎండీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లాలో డిప్యూటి సీటీఎంగా పనిచేస్తున్న రామమ్‌కు పదోన్నతి కల్పించి నెల్లూరు ఆర్ఎంగా నియమించారు. కావలి డిపో మేనేజర్ సుష్మను ప్రకాశం జిల్లా అద్దంకి డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో ప్రొద్దుటూరు డిపో మేనేజర్ హరిని నియమించారు. వాకాడు డిపో మేనేజర్ ముక్కేశ్వరరావును తిరుపతి బస్‌స్టేషన్ ఏటీఎంగా బదిలీ చేసి ఆయన స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు డీఎం కృష్ణను నియమించారు.

# పరబ్రహ్మా తత్వమే.. శ్రీకృష్ణ తత్వమ్

**- గ్రంథావిష్కరణ సభలో చల్లా పెంచలరెడ్డి**



'శ్రీకృష్ణ చరితమ్' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

సాక్షాత్తూ ఆ పరబ్రహ్మ తత్వమే శ్రీకృష్ణ తత్వమని, భగవంతుని లీలా వైభవమే శ్రీకృష్ణ అవతారమని స్పెషల్ గ్రేడ్ డెప్యూటి కలెక్టర్ చల్లా పెంచలరెడ్డి అన్నారు. నెల్లూరు, దర్గామిట్టలో ఉన్న శ్రీకృష్ణయోగ మందిరంలో ఈనెల 26వ తేది రాత్రి 'శ్రీకృష్ణ చరితమ్' గ్రంథావిష్కరణ జరిగింది. ఈ గ్రంథాన్ని టిటిడి ధర్మప్రచార పరిషత్ విశ్రాంత సమన్వయకర్త, ప్రముఖ సాహితీవేత్త మల్లేల శ్రీహరి రచించగా, భార్గవి ఆటోమొబైల్స్ అధినేత కొండా బలరామరెడ్డి ప్రచురించారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పెంచలరెడ్డి మాట్లాడుతూ భక్తితత్వాన్ని విస్తరిల్లజేసే ఇలాంటి గ్రంథాలను అందరూ ఆదరించాలన్నారు. గ్రంథాన్ని వెలుగులోకి తెచ్చిన గ్రంథకర్త శ్రీహరిని, గ్రంథప్రచురణకర్త కొండా బలరామరెడ్డిని ఆయన అభినందించారు. వీరిరువురిని సభలో పాల్గొన్న విశిష్ట అతిథులు ఘనంగా సత్కరించారు. సభకు మాడరన్‌స్కూల్ అధినేత వాకాటి విజయ కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ప్రముఖ సాహితీ వేత్తలు మోపూరు వేణుగోపాలయ్య, మెట్టు రామ చంద్రప్రసాద్, కోట రాజశేఖర్, మందిరం ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ప్రమీలమ్మ, భార్గవి ఆటోమొబైల్స్ ఎం.డి నిరంజన్‌రెడ్డి, ప్రముఖ కళాకారిణి శారదామణి తదితరులు పాల్గొని శ్రీకృష్ణ చరితమ్ వైశిష్ట్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రపంచ తెలుగుసమాఖ్య రీజనల్ కో–ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, చీమకుర్తి వేంకటేశ్వరరావు, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, తిరుపతి హరగోపాల్, మస్తానయ్య, సర్వేపల్లి రామ్మూర్తి, మద్దూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. తొలుత కళాదీప్తి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ అధినేత ఇ.కె.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చిన్నారులు రిషిత, జాహ్నవి, భవ్యహాసిని ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# 5న 'పెరసం' 10వ వార్షికోత్సవం

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) 10వ వార్షికోత్సవం జూన్ 5వ తేదిన జరుగుతుందని ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోపూరు పెంచలనరసింహం, అవ్వారు శ్రీధరబాబు, కోశాధికారి తోట సులోచన ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి 'ఆద్వంద్వం' కవితా సంపుటిని రచించిన పుప్పాల శ్రీరామ్‌కు రాష్ట్రస్థాయి పెన్నా సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేస్తామన్నారు. నెల్లూరులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాల్‌లో ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వార్షికోత్సవ కార్యక్రమం ఉంటుందని, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కవిత్వ శిక్షణా కార్యశాలను కూడా నిర్వహించనున్నామని వారు పేర్కొన్నారు. కాకినాడ తెలుగుశాఖ అధిపతి సుంకర గోపాలయ్య 'ఆద్వంద్వం' పుస్తకాన్ని సమీక్షిస్తారని, ప్రముఖ కవులు పలమనేరు బాలాజీ, వంశీకృష్ణ, అద్దేపల్లి ప్రభు పాల్గొని కవితా రచనకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కవిసమ్మేళనం ఉంటుందన్నారు. ఈ వార్షికోత్సవ సభకు ముఖ్యఅతిథిగా నెల్లూరు నగర డిఎస్పీ ఎన్‌బిఎం మురళీకృష్ణ పాల్గొంటారని, పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగుసమాఖ్య ప్రాంతీయ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, కుట్టి విద్యాసంస్థల అధినేత లతీఫ్‌కుట్టి, నవ మల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ, ప్రముఖ రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి తదితరులు పాల్గొంటారని, కవులు రచయితలు సాహిత్యాభిమానులందరూ విచ్చేసి ఈ వార్షికోత్సవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

## అసెంబ్లీలో...

# మొదటిసారి అడుగుపెట్టేది ఒక్కరే!

**• 9మంది పాతోళ్ళే!**



జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలలోనూ వైసిపి అభ్యర్థులు గెలుపొందారు. అయితే వీరిలో తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టబోతున్నది గూడూరు ఎమ్మెల్యే వెలగపూడి వరప్రసాద్ ఒక్కరే కావడం గమనార్హం. 2014లో ఆయన తిరుపతి ఎంపీగా గెలిచాడు. ఐదేళ్ళు పార్లమెంటుకు పోయారు. ఇప్పుడు గూడూరు అసెంబ్లీ నుండి పోటీ చేసి విజయం సాధించడంతో తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టబోతున్న ఎమ్మెల్యే ఆయన ఒక్కడే!

వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఆరోసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రెండు ఉపఎన్నికలను కలుపుకుంటే ఆరోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించాడు. ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి 2012 ఉపఎన్నికలను కలుపుకుని నాలుగోసారి గెలిచాడు. ఇక నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యలు వరుసగా రెండోసారి విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు.



## మళ్ళీ తెరపైకి...

# రాజకీయ కుటుంబాలు

జిల్లాలో పేరుబడ్డ రాజకీయ కుటుంబాలన్నీ మళ్ళీ తెరమీదకొచ్చాయి. ఒక్క నేదురుమల్లి కుటుంబంలో తప్పితే మిగిలిన అన్ని రాజకీయ కుటుంబాలలో వాళ్ళు పోటీ చేసి ఈ ఎన్నికల్లో గెలిచారు. నేదురుమల్లి కుటుంబం మాత్రం ఎక్కడా పోటీ చేయలేదు. అయితే ఈ ఎన్నికల్లో వైసిపి తరఫున నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి క్రియాశీలకంగా పనిచేసి జగన్‌కు దగ్గరయ్యాడు. త్వరలో ఆయన్ను కూడా ఏదో ఒక పదవిలో మనం చూడగలం.

జిల్లాలో సుదీర్ఘకాల రాజకీయ చరిత్ర కలిగిన ఆనం కుటుంబంలో మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి గెలుపొందాడు. మేకపాటి కుటుంబం నుండి ఈసారి ఇద్దరు ఎమ్మెల్యేలయ్యారు. ఆత్మకూరు నుండి మేకపాటి గౌతంరెడ్డి, ఉదయగిరి అసెంబ్లీ నుండి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు గెలుపొందడం తెలిసిందే! జిల్లా రాజకీయాలలో ఘనచరిత కలిగిన నల్లపరెడ్డి కుటుంబానికి చెందిన నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోవూరు అసెంబ్లీ నుండి విజయం సాధించాడు. రాజకీయాలకతీతంగా ప్రజలలో మంచిపేరు తెచ్చుకున్న మాగుంట కుటుంబానికి చెందిన మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలు పార్లమెంటు సభ్యులుగా గెలుపొందడం జరిగింది. చాలాకాలం విరామం తర్వాత ఈ రాజకీయ కుటుంబాలకు పదవుల కళ వచ్చింది.

## జగన్ సారధ్యంలో...

# ఇక ప్రగతిపథంలో రాష్ట్రం

**– బత్తిని విజయకుమార్**



వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో రాష్ట్రం ఇక ప్రగతిపథంలో దూసుకువెళ్తుందని వైకాపా నాయకులు బత్తిని విజయకుమార్ అన్నారు. గూడూరులో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో 10 స్థానాలకు 10 స్థానాలు గెలుచుకోవడం, ఎంపీల స్థానాల్లో కూడా వైకాపా దిగ్విజయం సాధించడం ఎంతో సంతోషకరమని, అందుకు కృషిచేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జగన్ పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తుందని, దేశంలోనే అగ్రగామిగా ఉంటుందని అన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలకు, ప్రత్యేకించి గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుకు, తిరుపతి ఎంపి బల్లి దుర్గాప్రసాద్‌రావుకు అభినందనలు తెలిపారు. ఇకముందు కూడా ఇదేవిధంగా జగన్‌కు ప్రజలంతా అభిమానాన్ని అందించాలని ఆయన కోరారు. అప్పుల్లో వున్న ఆంధ్రప్రదేశ్... ఇక వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'నవరత్నాల' పథకాలతో అభివృద్ధి పథంలో పయణించి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుతుందని బత్తిని విజయకుమార్ అన్నారు.

# పోలీస్.. శభాష్..!



హోంగార్డులకు యూనిఫాంలు పంపిణీ చేస్తున్న జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేసిన పోలీసుల సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి అన్నారు. ఈనెల 26న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో స్పెషల్ పార్టీ బృందాలు, హోంగార్డులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 196 మంది స్పెషల్ పార్టీ సిబ్బందికి, 600 మంది హోంగార్డులకు యూనిఫాం పంపిణీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల్లో జిల్లా పోలీస్ యంత్రాగం బాధ్యాతయుతంగా విధులు నిర్వర్తించారని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కష్టపడి పని చేశారని అభినందించారు. ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా జిల్లా పోలీసు అధికారుల సమన్వయంతో సకాలంలో స్పందించి పరిష్కరించడంలో సఫలీకృతమయ్యారన్నారు. సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదనపు ఎస్పీలు పి. పరమేశ్వరరెడ్డి, వీరభద్రుడు, ఏఆర్ డీఎస్పీ వై.రవీంద్రరెడ్డి, నగర డీఎస్పీ ఎన్ బీఎం మురళీకృష్ణ, ఆర్‌ఐలు రమేష్ కృష్ణన్, రమణయ్య, మైలాలుద్దీన్, సీఐలు నాగేశ్వరమ్మ, షేక్ అన్వర్ బాషా, కె.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, కరుణాకర్, నరశింహారావు, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజీనామా పత్రాన్ని కలెక్టర్‌కు సమర్పిస్తున్న చాట్ల

# పదవిని వదిలిన 'చాట్ల'

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ పదవికి చాట్ల నరసింహారావు రాజీనామాచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరుణంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నాడు. మంగళవారం ఆయన తన రాజీనామా పత్రాన్ని జిల్లా కలెక్టర్ ముత్యాల రాజుకు అందజేశారు. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక మాజీమంత్రి నారాయణ పిలుపు మేరకు చాట్ల నరసింహారావు కాంగ్రెస్‌ను వీడి తెలుగుదేశంలో చేరాడు. 2016 ఏప్రిల్‌లో చాట్లను ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్‌గా నియమించారు. ఈ ఏడాది మార్చిలో వరుసగా రెండోసారి కూడా ఆయనను ఈ పదవిలో నియమించారు. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారిన నేపథ్యంలో చాట్ల తన పదవికి రాజీనామా చేశాడు.

# గుడివాడకు చంద్రశేఖర్‌రెడ్డి



తడ మండలం భీమునివారిపాలెం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు రవాణాశాఖ కార్యాలయంలో రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.చంద్రశేఖర్‌రెడ్డి కృష్ణాజిల్లా గుడివాడ రవాణా శాఖ అధికారిగా బదిలీ అయ్యాడు. చంద్రశేఖర్‌రెడ్డి 2015 ఆగస్టులో భీమునివారిపాలెం చెక్‌పోస్టు వద్ద బాధ్యతలు చేపట్టాడు. తాను బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే రవాణా శాఖ ఆదాయాన్ని రెట్టింపు చేశాడు. అక్రమ రవాణాకు కళ్లెం వేశాడు. ఎంతో సమర్ధవంతంగా ఇక్కడ విధులు నిర్వహించిన ఆయనకు రెండు నెలల క్రితమే ఆర్టీవోగా పదోన్నతి లభించింది. ఆర్టీఓగా గుడివాడకు బదిలీ అయ్యారు.

# 'అన్న'ను తలచుకున్న తమ్ముళ్ళు

**• టిడిపి ఆఫీసులో ఎన్టీఆర్ జయంతి**



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తెలుగుదేశం నాయకులు


తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 97వ జయంతి సందర్భంగా నెల్లూరుజిల్లా తెలుగుదేశం నాయకులు ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం నాయకులందరూ ఓటమి బాధతో వున్నప్పటికీ ఎన్టీఆర్ జయంతిని మరవలేదు. 28వ తేదీన నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీమంత్రులు పి.నారాయణ, టి.రమేష్‌రెడ్డి, మాజీఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పాశం సునీల్‌కుమార్, కొమ్మి లక్ష్మయ్య నాయుడు, కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామి నాయుడు తదితరులు పాల్గొని పార్టీ ఆఫీసులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అలాగే నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి కూడా నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# కళ్యాణ వైభవం...!





ప్రముఖ బ్యాటరీల ఉత్పాదనా సంస్థ 'నిప్పో ఇండోనేషనల్ లిమిటెడ్' హెచ్‌ఆర్ వైస్‌ప్రెసిడెంట్ పార్లపల్లి వెంకటమోహన్‌రామిరెడ్డి - ఉమల కుమారుడు **సృజన్‌రెడ్డి -నవ్య దుర్గరెడ్డి** (నెల్లూరు వాస్తవ్యులు తాటిపర్తి రవీంద్రరెడ్డి - ప్రసూనల కుమార్తె)ల కల్యాణం మే 19వ తేదీ నెల్లూరులోని పివిఆర్ కళ్యాణ మండపంలో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.




మనుబోలు మండలం పిడూరు వాస్తవ్యులు, మాజీమంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి వియ్యంకుడు మన్నెమేల సాయిమోహన్‌రెడ్డి - సుప్రియల కుమారుడు **రాధాకృష్ణారెడ్డి - హారిక** (చెందోడు వాస్తవ్యులు మద్దాలి ప్రతాప్‌రెడ్డి - రజనిల కుమార్తె)ల పరిణయం మే 19వ తేదీ నెల్లూరు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.




శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు - శైలజల కుమార్తె **పద్మనివేదిత -ప్రణవ్** (తమిళనాడులోని సేలం వాస్తవ్యులు విశ్వేశ్వరన్ - అనురాధల కుమారుడు)ల వివాహం మే 23వ తేదీ నెల్లూరులోని కెజికె కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.




జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఏజిఎం యదనపర్తి దయాకర్‌రెడ్డి - కుసుమల కుమార్తె **పవిత్ర - నవీన్‌కుమార్‌రెడ్డి** (నెల్లూరు ధనలక్ష్మీపురం వాస్తవ్యులు ఏలూరు కోదండరామిరెడ్డి - అరుణమ్మల కుమారుడు)ల పెళ్లి మే 15వ తేదీ నెల్లూరు పొదలకూరురోడ్డులోని హెచ్‌ఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభదీవెనెలు.

# ఎన్‌బికెఆర్ ఐఎస్‌టికి ఎన్‌బిఏ గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ రామ్‌కుమార్‌రెడ్డి

జిల్లాలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి అటానమస్ ఇంజనీరింగ్ కాలేజీకి ప్రతిష్టాత్మకమైన నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఏ) గుర్తింపు కొనసాగింపబడిందని కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్ తెలియజేశారు. కళాశాలలో ఇటీవల ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 30వ తేదీన ఎన్‌బిఏ పరిశీలక బృందం కళాశాలను సందర్శించిందని, కళాశాల స్థాయి, విద్యాబోధన, సౌకర్యాలు, సిబ్బంది అర్హతలు వగైరాలన్నిటినీ పరిగణనలోకి తీసుకుని నివేదికను ఉన్నతస్థాయి కమిటీలకు పంపడం జరిగిందని తెలిపారు. 2003వ సంవత్సరం నుంచి కళాశాలలోని అన్ని కోర్సులు ఈ గుర్తింపును కలిగి ఉన్నాయని, 5వ సారి ఇప్పుడు కళాశాల అందిస్తున్న సివిల్, మెకానికల్, ట్రిబుల్ ఇ, ఇసిఇ, సిఎస్‌ఇ బ్రాంచ్‌లకు టైర్-1 స్థాయిలో ఈ గుర్తింపు కొనసాగించబడిందని తెలిపారు. ప్రత్యేకమైన ఈ గుర్తింపు ద్వారా ఈ కళాశాలలో చదువుకున్న వారి డిగ్రీలు అంతర్జాతీయస్థాయిలో మంచి విలువ కలిగివుంటాయన్నారు. అనేక బహుళజాతి సంస్థలు ఈ టైర్-1 గుర్తింపు కలిగిన కళాశాల విద్యార్థులను మాత్రమే క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఎంచుకోవడానికి ముందుకొస్తాయని పేర్కొన్నారు. స్వయంప్రతిపత్తిని కలిగివున్న తమ కళాశాల ఈ ప్రత్యేక గుర్తింపుతో మరింత ఉన్నతస్థాయిని చేరుకుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల అభివృద్ధికి తోడ్పడుతున్న తమ సిబ్బందిని, అధ్యాపకులను, విద్యార్థులను అందరినీ ఆయన అభినందించారు. ఈ సమావేశంలో కళాశాల డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డితో పాటు అన్ని కోర్సుల విభాగాధిపతులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# అభివృద్ధిపై దృష్టిపెడతా

**- బల్లి దుర్గాప్రసాద్‌రావు**


బల్లి దుర్గాప్రసాద్‌రావును సన్మానిస్తున్న వైకాపా నాయకులు

తిరుపతి పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలతో కలసి ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి పాటుపడతానని తిరుపతి పార్లమెంట్ సభ్యుడు బల్లి దుర్గాప్రసాద్‌రావు అన్నారు. సోమవారం గూడూరులో పలువురు వైకాపా నాయకులు ఆయన్ను కలసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బల్లి దుర్గాప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు అందరూ కలసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించారని అంటూ ఈ సందర్భంగా అందరికీ ఆయన తన ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. ప్రధానంగా వాకాడుమండలంలోని దుగరాజపట్నం పోర్టుపై ఎమ్మెల్యేలతో కలసి సమస్య పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల వైకాపా అధ్యక్షులు మల్లు విజయకుమార్‌రెడ్డి, రాజారెడ్డి, రాధారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెడిచర్ల శ్రీనివాసులురెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జగన్ దిగ్విజయం హర్షదాయకం

**- కనుమూరు హరిచంద్రారెడ్డి**


మాట్లాడుతున్న వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి హరిచంద్రారెడ్డి

రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అఖండవిజయం సాధించడం హర్షదాయకమని వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కనుమూరు హరిచంద్రారెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని ఆయన నివాసంలో ఇటీవల ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పాలన పట్ల ప్రజలు విసిగిపోయారన్నారు. తిరుపతి ఎంపీగా గెలిచిన బల్లి దుర్గాప్రసాద్‌రావుకు, గూడూరు ఎమ్మెల్యేగా గెలిచిన వరప్రసాద్‌రావుకు ఆయన తన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ప్రవీణ్, దేవానంద్, మనపాటి రవి, నరసరాజు, ఉదయ్‌కుమార్, సాయి, పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# 151 స్థానాలు గెలిచింది టిడిపినే

## - చంద్రబాబు లాజిక్

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరంలోని డికెడబ్ల్యూ కళాశాల. మే 23వ తేదీ సాయంత్రం 6గంటలు. అప్పటికే చాలాచోట్ల ఎన్నికల ఫలితాలు వచ్చాయి. జిల్లాలోని 9 స్థానాలలో వైసిపి అభ్యర్థులు సునాయాసంగా గెలుపొందారు. నెల్లూరు నగరంలో మాత్రమే వైసిపి అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, తెలుగుదేశం అభ్యర్థి పి.నారాయణల మధ్య నువ్వా-నేనా అన్నట్లు పోటీ నడుస్తోంది. అప్పటివరకు అక్కడుండి ఫలితాన్ని పర్యవేక్షిస్తున్న పి.నారాయణకు అక్కడి టెన్షన్ వాతావరణం వల్ల బి.పి పెరుగుతుండడంతో టిడిపి నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిలు... మీరు ఇక్కడ వుండడం మంచిది కాదు సార్, వెళ్లి పార్టీ ఆఫీసులో కూర్చోండి అని చెప్పి పంపారు. నారాయణ పార్టీ ఆఫీసుకు బయలుదేరాక చాట్ల నరసింహారావు వచ్చి... ఇప్పుడు ఆయనను పార్టీ ఆఫీసుకు ఎందుకు పొమ్మన్నారని అడిగాడు. అందుకు ముంగమూరు... ఆల్‌రెడీ ఓడిపోయిన మన 9మంది అభ్యర్థులు పార్టీ ఆఫీసులో కూర్చుని వున్నారు. గెలిస్తే ఫర్వాలేదు... ఓడితే వారిలో ఒకడుగా వుంటాడు. పెద్దగా బాధ వుండదు. అందుకే అక్కడికి పంపించామని చెప్పాడు. ముంగమూరు ముందుచూపుకు చాట్ల మనసులోనే అభినందించాడు.


నారాయణ కారులో నేరుగా మినీ బైపాస్‌రోడ్డులోని టిడిపి ఆఫీసుకు చేరుకున్నాడు. కారు దిగి పైఅంతస్తులోకి వెళ్లాడు. పార్టీ జిల్లా అధ్యక్షుడి గది తలుపును కొంచెం తీశాడు. లోపల ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో పాటు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొల్లినేని రామారావు, బొల్లినేని కృష్ణయ్య, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌లు అక్కడ వుండి టివిలో నెల్లూరు సిటి ఫలితాన్ని వీక్షిస్తున్నారు. అందరూ... అబ్బా ఇది ఒక్కటి గెలిస్తే చాలు అంటున్నారు. నెల్లూరు ఫలితం పట్ల వారిలో టెన్షన్ చూసి నారాయణ డోర్ వద్దే ఆగిపోయాడు. వాళ్లందరూ ఓడిపోయినా, వాళ్ళంతా తన గెలుపు కోసం టెన్షన్ పడుతున్నట్లు భావించాడు. వాళ్లు పడుతున్న టెన్షన్‌కు ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరగసాగాయి. అలా ఆయన చూస్తుండగానే "నెల్లూరు నగరంలో అనిల్‌కుమార్ విజయం" అనే ఫ్లాష్ న్యూస్ ఫ్లాష్‌లా మెరిసింది. అది చూడగానే.. లోపలున్న వాళ్ళంతా ఒకరికొకరు షేక్‌హ్యాండ్స్ ఇచ్చుకుని... హమ్మయ్యా... ఈ ఒక్కటి కూడా వైసిపి గెలిచింది. అదే టిడిపి గెలిచుంటేనా... మనమంతా తలలెత్తుకుని తిరగలేం... అని చెప్పుకున్నారు. అది చూసి నారాయణ... ఇప్పటిదాకా వీళ్ల టెన్షన్ పడింది నేను గెలుస్తానన్నా.. అని నోరెళ్లబెట్టాడు. జిల్లాలో ఓటమి సంపూర్ణం కావడంతో నాయకులంతా అక్కడ నుండి లేచి బయటకు వస్తూ అక్కడే వున్న నారాయణను చూశారు. బొల్లినేని రామారావు ఆయనతో... బ్యాడ్‌లక్ అన్నా, మేమంతా ఓడిపోయినా నువ్వన్నా గెలుస్తావనుకున్నాం... అందుకోసమే ఇప్పటిదాకా దేవుడిని కూడా ప్రార్థించాం... ఏం చేద్దాం అలా జరిగిపోయింది అని ఓదార్చాడు. జరిగిన సీన్ అంతా చూసి వుండడంతో నారాయణ మనసులో... రాజకీయాలు ఇంత దరిద్రంగా వుంటాయా అని అనుకున్నాడు. సోమిరెడ్డి వుండి... కార్లు తీస్తే అందరం అమరావతికి పోదాం అని చెప్పాడు. బీద రవిచంద్ర అందుకు... చంద్రబాబు వద్దకు ఏం ముఖం పెట్టుకుని పోగలం అని అన్నాడు. దానికి సోమిరెడ్డి... ఆయన వద్దకు పోవడానికి ప్రత్యేక మాస్క్‌లేమీ అక్కరలేదు... మన ముఖాలే చాలు... అవతల మంగళగిరిలో లోకేష్ కూడా ఓడిపోయాడు... ఆయన పోగొట్టుకున్న దాంతో పోలిస్తే, మనం పోగొట్టుకున్నదెంత... అని "బావగారు బాగున్నారా" సినిమాలో కోట శ్రీనివాసరావు లాగా డైలాగ్ వదిలాడు. అందరూ చంద్రబాబును పరామర్శించడానికి అమరావతి బయలుదేరారు.

★★★★★

ఉండవల్లిలోని తన నివాసంలో హైటెక్‌రత్న చంద్రబాబు ప్రెస్‌మీట్ పెట్టాడు. హాల్ విలేకరులతో కిక్కిరిసి వుంది. చంద్రబాబు మాట్లాడడం మొదలుపెట్టి... నేను మొదటి నుండి చెబుతున్నాను ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరగలేదు... ఎన్నికల కమిషన్ పక్షపాతంగా వ్యవహరిస్తూ వచ్చింది. ప్రధాని మోడీ మమ్మల్ని ఇబ్బంది పెట్టాలనుకున్నాడు. అయినా ఎన్నికల ఫలితాల సరళి చూస్తే మేం గెలిచినట్లే అని చంద్రబాబు అన్నాడు. అప్పుడు టివి 9.5×95 విలేకరి చాదస్తపు షణ్ముగం లేచి... మీది ఎలా గెలుపవుతుంది సార్ అని ప్రశ్నించాడు. దానికి చంద్రబాబు... నేను ఎన్నికల రోజున ఏం చెప్పాను అని అడిగాడు. మీరు చాలా చెబుతుంటారు.. అవన్నీ గుర్తుపెట్టుకునే మెమొరీ మా వద్ద లేదు. మీరు ఏ సుభాషితం చెప్పారో సెలవివ్వండి అని ఆత్మసాక్షి విలేకరి ఆత్మానందం అడిగాడు. అప్పుడు చంద్రబాబు.. నేను సైకిల్‌కు ఓటేస్తే ఫ్యాన్‌కు పడిందని చెప్పాను గుర్తుందా? అని గుర్తు చేశాడు. విలేకరులంతా అవును అని కోరస్‌గా చెప్పారు. రాష్ట్రంలో సైకిల్‌కు వేసిన ఓట్లన్నీ ఫ్యాన్‌కు పడ్డాయి. ఫ్యాన్‌కు వేసిన ఓట్లన్నీ సైకిల్‌కు పడ్డాయి. ఎలక్షన్ కమిషన్ ఆ విధంగా ఈవిఎంలను మార్చింది. దీంతో మాకు రావాల్సిన 151 అసెంబ్లీ సీట్లు, 22 పార్లమెంటు సీట్లు వైసిపికి పోయాయి. వైసిపికి రావాల్సిన 23అసెంబ్లీ, 3 పార్లమెంట్ సీట్లు మా పార్టీకి వచ్చాయి. ఇది కేవలం ఈవిఎం మిస్టేక్ అని చెప్పాడు. చంద్రబాబు లాజిక్‌కు విలేకరులంతా నోరెళ్లబెట్టారు. అప్పుడే అక్కడకు వచ్చిన నెల్లూరుజిల్లా టిడిపి అభ్యర్థులు పదిమంది... చంద్రబాబు మాటలు విన్నారు. ఈ లెక్కన అయితే మనం పదిమందిమి కూడా గెలిచినట్లే కదా అని పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నాడు. అప్పుడు పరసారత్నం... ఈ లెక్కన జిల్లాలో హైయ్యస్ట్ మెజార్టీ నాదే అని సంబరపడసాగాడు. సోమిరెడ్డి వుండి... ఈ కోణంలో చూస్తే మనమంతా సులభంగా గెలిచినట్లే.. పాపం నారాయణే.. గెలుపు కోసం ఆపసోపాలు పడి మనందరికంటే చాలా తక్కువ మెజార్టీతో చావుతప్పి కన్ను లొట్టపోయి గెలిచినట్లయ్యిందని అన్నాడు. సోమిరెడ్డి మాటకు నారాయణ... ఓడినా మనోళ్ళేం మారడం లేదని మనసులో అనుకున్నాడు.

---

**ఎండాకాలం మండిపోతోందంటే ఏంటో అనుకున్నాం కానీ, ఇంతగా కాలుస్తున్న ఎండల్ని మనం గతంలో ఎప్పుడూ చూడలేదు. ఓ పదేళ్ళ క్రితం 28 నుంచి 30 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండేది. అప్పట్లో మరో రెండు డిగ్రీలకు ఉష్ణోగ్రత పెరుగుతున్నదని తెలిసి 'నెల్లూరేందబ్బా ఇంతగా మండిపోతోంది' అనుకున్నవారంతా ఇప్పుడు ఈ మండుతున్న ఎండల్ని చూసి హతాశులైపోతున్నారు.**



- అల్లాడుతున్న ప్రజలు
- 47 డిగ్రీలకు పైగానే పెరిగిన ఉష్ణోగ్రత

# కాలుస్తున్న ఎండలు

పక్కనే సముద్రం ఉన్నా, సముద్రపు గాలులతో ఎప్పుడూ చల్లగా ప్రశాంతంగా ఉండే నెల్లూరు ఇప్పుడు అగ్నిగుండంలా మారిపోయింది. చెట్టు చేమ నాశనమైంది..పర్యావరణం కన్పించకుండా పోయింది. చల్లదనం అన్నది ఎటో ఎగిరిపోయింది. వానలు కరువై, ఎండలే విరుచుకుపడుతున్నాయి. ఈ ఎండాకాలం కూడా పూర్వంలా లేదు.. అగ్గిపుల్ల గీసి ఒంటిమీద పెట్టినట్లు భగ్గుమంటోంది. ఇంతటి భయంకరమైన ఎండలు నెల్లూరోళ్ళు ఎప్పుడూ చూళ్ళేదు. ఈ ఎండల దెబ్బకు జిల్లా ప్రజలు అల్లాడిపోతున్నారు. చిన్నారులు, వృద్ధులతో పాటు సామాన్య ప్రజలు కూడా హడలిపోతున్నారు. భగ్గుమంటున్న ఎండలకు..ముఖ్యంగా నెల్లూరు నగరంలోని సిమెంటు రోడ్లు కాలిన పెనుంలా అయిపోతున్నాయి. కాలు పెడితే భగ్గుమని కాలిపోతున్నాయి. అట్టుడికినట్టు ఉడికిపోవడమంటే ఏమిటో నెల్లూరు నగరవాసులు ఇప్పుడు కళ్ళారా కాదు..'కాళ్ళారా' చూస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఎండ చుర్రుమంటోంది. సాయంత్రం 6గంటలు దాటితే తప్ప ఎండలు ఉపశమించడం లేదు. అప్పటికీ సెగగాలులు వీస్తూనే ఉన్నాయి. ఈ ఎండల్లో చిన్నపిల్లలు, ముసిలీ ముతకా... రాత్రి పగలు ఉక్కతో, వేడితో నిద్రపట్టక అవస్తలు పడుతున్నారు. ఫ్యాన్లు వేస్తే సెగగాలులు వస్తున్నాయి. ఏసీలు ఎంతసేపని వేయగలం?. ఆ తర్వాత వచ్చే బిల్లులు ఎండలకంటే ఎక్కువగానే వినియోగదారుల్ని హడలగొట్టేస్తున్నాయి. ఈ ఎండలు త్వరగా తగ్గిపోవాలని జనం వేయిదేవుళ్ళకు మొక్కుకుంటున్నారు.

### ఈ వేసవి తీవ్రత ఎప్పుడు తగ్గేనో..?

రోహిణి కార్తెలో రోళ్ళు పగిలిపోతాయని నానుడి ఉండేదని అందరికీ తెలిసిందే. అయితే, అదెలా ఉంటుందో.. ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం. మే నెల అంటేనే వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అయితే, ఈ మే మాత్రం మరింత ఉగ్రరూపం దాల్చింది. గత పది పదిహేను రోజులుగా ఎండ మిడిమేళంగా కాస్తోంది. నెలలో మొదటి పదిహేను రోజులు కొంచెం కొంచెంగా పెరుగుతూ చిన్నగా 35 నుంచి 40 డిగ్రీలకు చేరుకుంది. 40 డిగ్రీల వేడిని తట్టుకోవాలంటే చిన్నవిషయమేమీ కాదు. ఈ ఎండలదెబ్బకు వడదెబ్బ తగిలి పలువురు ప్రాణాలు కోల్పోయారు కూడా. అలాంటిది 40 డిగ్రీలు దాటితే పరిస్థితి ఇంకెంత ఘోరంగా ఉంటుందో చూడండి. ఈనెల 20నుంచి అది కూడా అనుభవంలోకి వచ్చింది. 40.8 డిగ్రీల వేడితో ఎండ భగ్గుమంది. ఇక ఇక్కడి నుంచి ఏరోజు కారోజు మరింత మండిపోతూ సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతూనే ఉన్నాడు. 25న ఏకంగా 43.1 డిగ్రీల వేడితో భూమి భగభగలాడింది. 28న 46 నుంచి 47డిగ్రీల దాకా పెరిగింది. ఇంకొద్ది రోజులు పోతే 50 డిగ్రీలకు కూడా చేరుకుంటుందేమోనని, ఈ ఎండకు ఇక నిలవలేమని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఇంకా మరో వారం పది రోజుల దాకా పరిస్థితి ఇలాగే ఉంటోందని అంటున్నారు. మరి ఇంతటి మండే ఎండల్లో ఎలా బతకాలి దేవుడా అంటూ జనం గోడుగోడుమంటున్నారు.

---

### ఎంతో విలక్షణమైనది..

# మోచర్ల రచనా వైభవం

**- జయంతి సభలో అగస్త్యరాజు సుబ్బారావు**



అగస్త్యరాజు సుబ్బారావును సన్మానిస్తున్న మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి

మోచర్ల రచనా వైభవం ఎంతో విలక్షణమైనదని ప్రముఖ సారస్వతవేత్త అగస్త్యరాజు సుబ్బారావు ప్రశంసించారు. నెల్లూరుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త మోచర్ల రామకృష్ణయ్య జయంతి సభ ఈనెల 27న నెల్లూరు పురమందిరం ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి (జూనియర్) ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ సభలో 'మోచర్లవారి నాటక రచనా వైశిష్ట్యం' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ మోచర్లవారి రచనా శైలి అత్యద్భుతమన్నారు. ఆయన రచించిన 'ప్రచండ భార్గవం' నాటకం గురించి ఈ సందర్భంగా చక్కగా వివరించారు.

వర్ధమాన సమాజం అధ్యక్షుడు బత్తినపట్ల శేషారెడ్డి సభకు అధ్యక్షత వహించగా, మోచర్ల రామకృష్ణయ్య స్మారక సాహితీనిధి పక్షాన వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి అగస్త్యరాజు సుబ్బారావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల కళాకారులు వల్లకవి వేంకటసుబ్బారావు, ప్రముఖ సాహితీవేత్త చీమకుర్తి వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


# కళ్యాణ వైభవం...!

## ధీరజ్‌రెడ్డి - లాస్య



నిరూప చిన్నపిల్లల ఆసుపత్రి అధినేత డాక్టర్ కేతిరెడ్డి సోమనాథ్‌రెడ్డి - నిరూపరాణిల కుమారుడు **డాక్టర్ ధీరజ్‌రెడ్డి - డాక్టర్ లాస్య** (ఇస్కా మల్లిఖార్జునరెడ్డి - స్మితల కుమార్తె)ల వివాహం మే 29వ తేదీ నెల్లూరులోని కెజికె కళ్యాణ మండపంలో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## పునీత శ్రీవిద్య - అభిషేక్



కృష్ణపట్నం పోర్టు పిఆర్ హెడ్ ఘంటా వేణుగోపాల్ - నిర్మలల కుమార్తె **పునీత శ్రీవిద్య - అభిషేక్** (తెనాలి వాస్తవ్యులు గోగినేని నరేంద్రబాబు - హిమబిందుల కుమారుడు)ల కళ్యాణం మే 29వ తేదీ నెల్లూరులోని కెజికె కళ్యాణ మండపంలో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

# అధినేతకు అభినందనలు



రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని సృష్టించి రికార్డు మెజార్టీతో పార్టీని గెలిపించిన వైసిపి అధినేత వై.యస్. జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసగృహంలో కలిసి అభినందిస్తున్న నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి.

# జయహో జగన్..



ఎన్నికల ఫలితాల అనంతరం బాపట్ల లోక్‌సభ సభ్యుడిగా విజయం సాధించిన నందిగం సురేష్‌తో కలిసి వెళ్లి వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న బాపట్ల పార్లమెంటు ఎన్నికల ఇన్‌ఛార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి.

# విద్యార్థుల భవితను తీర్చిదిద్దడమే 'విశ్వసాయి' ధ్యేయం



వేడుకలను ప్రారంభిస్తున్న విశ్వసాయి ఛైర్మెన్ డా. ఎన్.సత్యనారాయణ

విద్యార్థులను జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో కూడా ఉత్తీర్ణులయ్యేలా విద్యాబోధన చేస్తూ వారి భవితను తీర్చిదిద్దడమే విశ్వసాయి విద్యాసంస్థల ధ్యేయమని ఆ సంస్థల ఛైర్మెన్ డా.ఎన్. సత్యనారాయణ, వైస్ ఛైర్మెన్ జి. కృష్ణమోహన్, ఛైర్‌పర్సన్ శ్రీమతి రుక్మిణి అన్నారు. ఈనెల 30న నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని తమ కళాశాలలో జరిగిన 'ఇండక్షన్ డే'లో వారు మాట్లాడుతూ ఇంటర్ విద్యా విధానంలో నూతన ఒరవడికి నాందిపలుకుతూ విశ్వసాయి విద్యాసంస్థలు విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందిస్తున్నాయన్నారు. నాణ్యత కలిగిన, నైతిక విలువలతో కూడిన, వత్తిడి లేని విద్యను అందించడమే తమ లక్ష్యమన్నారు. పదవ తరగతిలో ఉత్తమఫలితాలు సాధించిన అనేకమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తల్లిదండ్రులు ఈ దశలో తమ పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధ్యాపకులు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల నిర్వాహకులతో పాటు కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్మాన్ని ప్రబోధించేదే.. మహాభారతం

- 18 రోజుల పాటు వీనులవిందుగా ఉపన్యాసాలు



మహాభారత ఉపన్యాస సభలో పాల్గొన్న పోలవరపు లక్ష్మీనరసింహారావు, చీమకుర్తి వెంకటేశ్వరరావు, బలరామయ్యనాయుడు తదితరులు

తింటే గారెలే తినాలి..వింటే భారతమే వినాలి అన్నట్లుగానే మహాభారతంలోని 18 పర్వాలను 18 రోజుల పాటు ప్రముఖ ఉపన్యాసకులు వివరించి అందరి ప్రశంసలు అందుకున్నారు. పద్యసారస్వత పరిషత్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామస్వామి మందిరంలో ఈనెల 7 నుంచి 24వ తేది వరకు వీనుల విందుగా జరిగిన భారతోపన్యాసాల కార్యక్రమంలో ప్రముఖ కవి పండితులు, ఆధ్యాత్మికవేత్తలు, సారస్వతవేత్తలు ఉపన్యాసకులుగా పాల్గొన్నారు. మహాభారతాన్ని సంస్కృతంలో వేదవ్యాస మహర్షి రచించగా, కవిత్రయంగా ప్రసిద్ధి చెందిన నన్నయ్య, తిక్కన, ఎర్రన మహాకవులు తెలుగులోకి అనువదించారని, వేదసారమంతా ఇందులో ఉంది కనుక, మహాభారతం పంచమ వేదంగా ప్రఖ్యాతి చెందిందని, ఇది ఒక గొప్ప ఇతిహాసమని వక్తలు వివరించారు. ధర్మార్థ కామమోక్షాలకు సంబంధించిన అన్ని రకాల అంశాలు మహాభారతంలో ఉన్నాయని వారు విశదీకరించారు. ఉపన్యాసకులు డా. సూరం శ్రీనివాసులు, విద్వాన్ ఆలూరి శిరోమణిశర్మ, పోలవరపు లక్ష్మీనరసింహారావు, అవధాని కోట రాజశేఖర్, చదలవాడ లక్ష్మీనరసింహారావు, డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు, విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు, డా. కె.గిరిజాలక్ష్మి, శతావధాని కొండెపి మురళీకృష్ణ, దర్శి బాలసుబ్రహ్మణ్యం, విద్వాన్ మాచవోలు శివరామ్‌ప్రసాద్, డా. ఐనవోలు శ్రీనివాస చక్రపాణి, డా. కె.సత్యనారాయణ, డా. సింగరాజు ప్రసాదరావు, బత్తెన సాయికుమార్‌లు పాల్గొని మహాభారతంలోని 18 పర్వాలను, వాటి విశేషాలను తమ ఉపన్యాసాల్లో వివరించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు తదిరులు పాల్గొన్నారు. ఇనమడుగు శ్రీ సత్యానందాశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీహరితీర్థస్వామి ఆశీస్సులతో, మందిరం నిర్వాహకుల సహకారంతో ఈ కార్యక్రమాలు ఆద్యంతం అద్భుతంగా జరిగాయి.

### విజయనగరం ఎమ్మెల్యేకి...

# నెల్లూరులో 'అతిథి' సత్కారం



ఎమ్మెల్యే వీరభద్రస్వామిని సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

ఆదివారం తిరుమల దర్శనార్థం రోడ్డుమార్గాన వెళుతూ విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీర భద్రస్వామి నెల్లూరులోని హోటల్ అతిథి గ్రాండ్‌లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో విజయనగరం నుండి ఘన విజయం సాధించిన వీర భద్రస్వామిని ఈ సందర్భంగా హోటల్ అతిథి గ్రాండ్ అధినేత యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఆర్యవైశ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్‌తో పాటు అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట సూర్యనారాయణ, చలువాది శరణ్‌కుమార్, వి.ఇ.మురళీకృష్ణ పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# 'మంత్రి' రేసులో అందరూ!



ఎన్నికలు అయిపోయాయి... ఫలితాలు కూడా వచ్చేశాయి. జిల్లాలో వైసిపి తరపున పోటీ చేసిన పదిమంది ఎమ్మెల్యే అభ్యర్థులు గెలిచారు. ముఖ్యమంత్రిగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం కూడా పూర్తయ్యింది. ఆ తర్వాత ఏంటి?... ఈ ప్రశ్నకు సమాధానమే మంత్రి పదవుల కేటాయింపు. ఈ విషయం చర్చకు వచ్చినప్పుడు వెంటనే వచ్చే సందేహం నెల్లూరు జిల్లా నుండి ఎవరు? ఇప్పుడు దీనిపైనే జిల్లా వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. జిల్లాలో పది సీట్లు గెలవడంతో దాదాపు అందరూ మంత్రి పదవుల రేస్‌లో వున్నట్లయ్యింది. రేసులో వున్నోళ్ళలో ఒక్కొక్కరు ఒక్కో అర్హతతో మంత్రి పదవులు కోరుతున్నారు.

వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి సీనియర్ నాయకుడు. గతంలో ఎన్టీఆర్, వై.యస్., రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల కేబినెట్‌లలో మంత్రిగా పనిచేశాడు. జిల్లాలో బలమైన వర్గమున్న నాయకుడు. ఈ ఎన్నికల్లో నాలుగైదు నియోజకవర్గాలలో పార్టీకి ఉపయోగపడ్డాడు. కాకపోతే కష్టకాలంలో జగన్‌కు అండగా నిలవకుండా ఆయనపై బండలు వేశారనే అపవాదు ఒక మైనస్. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పార్టీలో సీనియర్. మంత్రిగా సీనియర్. 2009లోనే టిడిపిని వదిలి వైయస్ వెంట నడిచాడు. వై.యస్. మరణానంతరం జగన్‌ను అనుసరించాడు. జిల్లాలో బలమైన వర్గం, మంచి పేరు వున్న కుటుంబం. పార్టీని కష్టకాలంలో ముందుండి నడిపించిన నాయకుడిగా సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి కూడా రేసులో వుండగా, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి సైతం మంత్రి పదవిపై బలంగా ఆశలు పెట్టుకుని వున్నాడు. జగన్ వైసిపిని పెట్టాక కాంగ్రెస్‌ను వదిలేసి ఆయన వెంట నడిచింది తమ పదవులకు రాజీనామాలు చేసి ఉపఎన్నికలను ఎదుర్కొన్నది మేకపాటి కుటుంబసభ్యులే! ఈ దృష్ట్యా వాళ్ళ కోణంలో వాళ్ళు రేస్‌లో వున్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కూడా మంత్రిపదవిపై ఆశ ఉందిగాని, రేస్‌లో మాత్రం చాలా వెనుకబడివున్నట్లు తెలుస్తోంది. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు మాత్రమే మంత్రి పదవుల కోసం బలంగా ప్రయత్నాలు చేయడం లేదు.

ఇక బిసి కోటాలో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ పేరు బలంగా వినపడుతోంది. జగన్ వీరసైనికులలో అనిల్ ఒకడు. వైసిపి అధికారంలోకి వస్తే అనిల్‌కు మంత్రి పదవి ఖాయమనే ప్రచారం ఎప్పటినుండో వుంది. గత ఐదేళ్లలో జగన్ వీరసైనికుడిగా ఆయనపై ముద్ర పడిపోయింది.

జిల్లాలో ఒక పదవి 'రెడ్డి' సామాజికవర్గానికి ఇచ్చే అవకాశముంది. రెండోది బిసిలకివ్వాలనుకుంటే అన్ని జిల్లాలలోనూ సమీకరణలను బట్టి బీసీల కోటాలో అనిల్‌కు రావొచ్చు. ఒకవేళ జిల్లా నుండి ఎస్సీ కోటాలో అవకాశమొస్తే సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు మొదటి ప్రాధాన్యత వుండొచ్చు. అదే సమయంలో ఎస్సీ కోటా నుండి గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాద్‌రావు కూడా మంత్రి పదవి ఆశల్లో వున్నాడు. ఏదైనా ఇంకో వారంలో తేలిపోతుంది.

# ప్రతి'నాయక్' పాత్రకు రెడీ!



***40ఏళ్ళ రాజకీయ చరిత్ర... 14ఏళ్ళు ముఖ్యమంత్రిగా అనుభవం... ప్రపంచ దేశాలకే పాఠాలు చెప్పాననే ఆత్మవిశ్వాసం... అగ్రరాజ్యాల అధినేతలు కూడా తన అపాయింట్‌మెంట్‌ను అడుగుతుంటారనేంత స్వఘనత చరిత... అలాంటి చరిత్ర వున్న నాయకుడు తన అనుభవం వయసు వున్నంత వ్యక్తి ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో అడుగుపెట్టి వుంటే.. అతని ముందు ఈ అనుభవశాలి ప్రతిపక్ష నేతగా కూర్చోగలడా? మే23వ తేదీ ఎన్నికల ఫలితాలు చూసిన తర్వాత రాష్ట్ర రాజకీయ విశ్లేషకులు చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో కూర్చుంటారా...? అనే అనుమానాలు వ్యక్తం చేశారు. చంద్రబాబు పార్టీని సూపర్‌లీడ్ చేస్తూ గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్‌లలో ఒకరికి ప్రతిపక్ష నేత బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం కూడా జరిగింది.***

అయితే 29వ తేదీ జరిగిన టీడీఎల్పీ సమావేశంలో చంద్రబాబునే తమ నేతగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. దీంతో అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పాత్ర పోషించడానికి చంద్రబాబు మానసికంగా సిద్ధపడ్డట్లయ్యింది. చంద్రబాబుకు ఇంకో ఘనత ఏంటంటే వై.యస్. తండ్రీ, కొడుకుల కాలంలోనే ప్రతిపక్ష నేత పాత్ర పోషించాల్సి రావడం. 2004 నుండి 2009 దాకా వై.యస్.రాజశేఖరరెడ్డి సీఎంగా వుండగా, చంద్రబాబు ప్రతిపక్ష నేతగా వున్నారు. ఆ తర్వాత రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల కాలంలో కూడా ప్రతిపక్ష నేతగానే వున్నా, వాళ్లిద్దరితో సానుకూలంగానే ముందుకు పోయాడు. ఇప్పుడు వై.యస్.రాజశేఖరరెడ్డి తనయుడు జగన్మోహన్‌రెడ్డి ముందు చంద్రబాబుకు ప్రతిపక్ష నేత హోదా వచ్చింది. రేపు అసెంబ్లీలోనూ ఆయన ప్రతిపక్ష నేత హోదాలో అడుగుపెట్టబోతున్నాడు. అసెంబ్లీలో ఆయనే సీనియర్ అవుతాడు. ఆయన అనుభవం, రాజకీయ పరిజ్ఞానం ఈ అసెంబ్లీకి ఎంతో అవసరం. బాబు అనుభవంతో పోలిస్తే జగన్ వయసులో చిన్నోడే! అయితే చంద్రబాబు చిన్నతనంగా భావించకుండా ప్రతిపక్షనేతగా వుండాలని నిర్ణయించుకోవడం అభినందనీయమే!

ఇక తెలుగుదేశం పార్టీని కూడా ఆయన అయితేనే ఈ పరిస్థితుల్లో నడపగలడు, ఆయన పక్కకు తప్పుకుంటే ఆ పార్టీ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరే అవుతుంది. తెలుగుదేశం పార్టీని స్థాపించాక ఈ 36ఏళ్లలో ఇంతటి ఘోరపరాజయాన్ని ఆ పార్టీ ఎప్పుడూ చవిచూడలేదు. ఆ పార్టీ శ్రేణులు మానసికంగా కుంగిపోయాయి. ఆత్మస్థైర్యం కోల్పోయిన టిడిపి కేడర్‌కు చంద్రబాబు నాయకత్వమే ధైర్యం చెప్పగలదు.

# కలలు పండించుకున్న 'కమలం' వీరులు



పార్లమెంట్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన అనంతరం మే 27వ తేదీ ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌కు విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోడీని అభినందిస్తున్న భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు, ఉషమ్మ దంపతులు

# ప్రమాణస్వీకార వేళ... అభిమానుల ఆనందహేల



పెద్దపుత్తేడులో వై.యస్.విగ్రహం వద్ద....



నెల్లూరు పొదలకూరురోడ్డులో కేక్ కట్ చేస్తూ...

గురువారం మధ్యాహ్నం 12.23 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు జిల్లా వ్యాప్తంగా సంబరాలు నిర్వహించారు. అన్ని మండలాలలో భారీఎత్తున బాణాసంచా కాల్చారు. కేక్‌లు కట్ చేశారు. దగదర్తి మండలం పెద్దపుత్తేడు గ్రామంలోని వై.యస్. విగ్రహం వద్ద వైసిపి నాయకులు చెర్లో కోటారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వాకర్స్ డిప్యూటి గవర్నర్ పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి ఈ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొని వై.యస్. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యకర్తలందరికీ స్వీట్లు పంచారు. నెల్లూరు పొదలకూరురోడ్డులో వైసిపి నాయకులు మేఘనాథ్‌సింగ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com